ABN ఆంధ్రజ్యోతి



తిరుపతి.. చిత్తూరు..మదనపల్లెల్లో

రేపే ముగ్గుల పోటీలు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సంక్రాంతిని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఈసారి ఆదివారం తిరుపతి, చిత్తూరు, మదనపల్లె పట్టణాల్లో నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు..రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన, ఎయిమ్ ఇనిస్టిట్యూట్స్ సౌజన్యంతో మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. తిరుపతి నగరంలో ఇందిరా మైదానం (తుడా మైదానం), చిత్తూరులో ఎన్‌పీసీ పెవిలియన్ కల్యాణమండపం (నాయుడు బిల్డింగ్స్, విజయ డిగ్రీ కాలేజీ దగ్గర), మదనపల్లెలో జడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపిక కాబడిన ఇద్దరు, మొత్తం 15 మందికి విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. తిరుపతిలో జరిగే పోటీలకు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్, చిత్తూరులో జరిగే పోటీలకు విజయం విద్యాసంస్థలు, మదనపల్లెలో జరిగే పోటీలకు శ్రీనివాస డిగ్రీ కాలేజ్, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.





ఎలక్ట్రిక్ ఫ్రెష్ ఏసీ బస్సు నమూనా - విజయవాడ వర్క్‌షాపులో బాడీ ఫిట్టింగ్ చేస్తున్న నిపుణులు

ఆరేళ్ల తర్వాత

ఆర్టీసీకి కొత్త కళ

- కాలం చెల్లిన బస్సుల స్థానంలో రోడ్డెక్కనున్న 252 బస్సులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 5: ఆరేళ్ల తర్వాత జిల్లాకు కొత్త ఆర్టీసీ బస్సులు రానున్నాయి. పైగా తాజా సాంకేతిక పరిజ్ఞానం(భారత్‌స్టేజ్ 6 టాటా, లేల్యాండ్ బస్సులు)తో కూడిన సరికొత్త బస్సులు రానున్నాయి. ఫిబ్రవరి నుంచి మే వరకు విడతల వారీగా ఇవి రోడ్డెక్కనున్నాయి. తిరుపతి జిల్లాలోని 11డిపోల పరిధిలో దాదాపు 800 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. ఇవన్నీ 2018 జూలైకు ముందు ఆయా డిపోలకు వచ్చినవే. ఆ తర్వాత ఒక్క బస్సును కూడా ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయలేదు. ఉన్నవాటికే తాత్కాలిక రిపేర్లు, మరమ్మతులు చేసుకుంటూ కాలం గడిపింది. ఈ క్రమంలో విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయం మార్గదర్శకాల ప్రకారం 252(అమరావతి ఏసీ వోల్వో-10, సూపర్‌లగ్జరీ-32, అల్ట్రాడీలక్స్-11, ఎక్స్‌ప్రెస్-52, పల్లెవెలుగు-147)బస్సులను కాలం చెల్లినవిగా గుర్తించారు. వాటి స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. టాటా, అశోక్ లేల్యాండ్ కంపెనీల నుంచి కొత్త బస్సుల ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి.

త్వరలో మరో 50 ఎలక్ట్రిక్ బస్సులు

అద్దె ప్రాతిపదికన త్వరలో మరో 50 ఎలక్ట్రిక్ బస్సులు తిరుపతి జిల్లాకు రానున్నాయి. ఈ మేరకు టెండర్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఒలెక్ట్రా కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే జిల్లాలో 100 దాకా తిరుగుతున్నాయి.తాజాగా వచ్చే బస్సులను శ్రీకాళహస్తి- తిరుపతి మధ్య 24, మిగిలిన 26 తిరుపతి కేంద్రంగా 70కిలోమీటర్ల దూరం వరకు ప్రముఖ నగరాలకు నడిపేందుకు కసరత్తు చేస్తున్నారు.

డిపోల వారీగా కొత్తబస్సులు

- తిరుపతి-41 : సూపర్‌లగ్జరీ 7, అల్ట్రాడీలక్స్ 8, ఎక్స్‌ప్రెస్ 3, పల్లెవెలుగు 23
- మంగళం-29 : అమరావతి ఏసీ వోల్వో 10, సూపర్‌లగ్జరీ 2, పల్లెవెలుగు 17
- పుత్తూరు-18 : సూపర్‌లగ్జరీ 2, పల్లెవెలుగు 16
- శ్రీకాళహస్తి-11 : సూపర్‌లగ్జరీ 2, అల్ట్రాడీలక్స్ 2, పల్లెవెలుగు 7
- వెంకటగిరి-41 : సూపర్‌లగ్జరీ 13, ఎక్స్‌ప్రెస్ 11, పల్లెవెలుగు 17
- గూడూరు-36 : ఎక్స్‌ప్రెస్ 16, పల్లెవెలుగు 20
- వాకాడు-43 : ఎక్స్‌ప్రెస్ 16, పల్లెవెలుగు 27
- సూళ్లూరుపేట-20 : సూపర్‌లగ్జరీ 5, ఎక్స్‌ప్రెస్ 4, పల్లెవెలుగు 11
- సత్యవేడు-13 : సూపర్‌లగ్జరీ 1, అల్ట్రాడీలక్స్ 1, ఎక్స్‌ప్రెస్ 2, పల్లెవెలుగు 9

పూరి నుంచి హిమాలయాలకు

ఆస్ట్రేలియా వనిత నడక ప్రయాణం



వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో జోడి

పుత్తూరు, జనవరి 5: ఆది శంకరాచార్య ఆధ్యాత్మిక ప్రేరణతో పూరి నుంచి దక్షిణ భారతదేశం మీదుగా హిమాలయ పర్వతాల వరకు ఒంటరిగా ఎనిమిది నెలలు నడిచేందుకు ఓ విదేశీ వనిత శ్రీకారం చుట్టింది. ఆస్ట్రేలియా దేశం పెర్త్ నగరానికి చెందిన ఆమె పేరు జోడి. వయస్సు 31 సంవత్సరాలు. డిగ్రీ వరకు చదివి యోగా టీచర్‌గా పని చేస్తోంది. మెడిటేషన్, మ్యూజిక్ అంటే ఇష్టం. భిన్న బాషలు, మతాలు వున్న బారత్‌ను ఆధ్యాత్మికత కలిపి వుంచుతోందని ఆది శంకరాచార్యుల బోధనలతో తెలుసుకుంది. స్వయంగా చూసిన అనుభవంతో పుస్తకం రాయాలని భావించింది. ఎనిమిది నెలల ఒంటరి ప్రయాణానికి ఇంటి నుంచి బయలుదేరి పూరి చేరుకుంది. 53 రోజులుగా నడుస్తూ తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని గురువారం రాత్రి పుత్తూరుకు చేరుకుంది.శుక్రవారం ఉదయాన్నే తిరిగి ప్రయాణాన్ని ప్రారంభించి పుత్తూరు డిగ్రీకళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి తన అభిప్రాయాలను పంచుకుంది.రోజూ సరాసరి 30 కిలో మీటర్లు నడుస్తున్నానని చెబుతున్న ఆమె తమ దేశంలో వున్న వాతావరణ పరిస్థితులే ఇక్కడా వున్నాయంటోంది. తన నడకతో మహిళల్లో కూడా ధైర్యం నింపుతానంటోంది.వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ రవిరాజు, మాధవనాయుడు, మునికృష్ణయ్య, రామచంద్రనాయుడు, రఘునాధరెడ్డి, రఫీ ఆమెను శాలువాతో సన్మానించి నగరి వైపు కొంత దూరం కూడా వెళ్లి వీడ్కోలు పలికారు.

తిరుపతికి మరోసారి 'స్వచ్ఛ' అవార్డు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్-2023 జాతీయ స్థాయి పురస్కారాల్లో తిరుపతి కార్పొరేషన్‌కు చోటు దక్కింది. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన పారిశుధ్య సర్వేలో ఉత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరపాలక సంస్థలు నిలిచాయి.గతంలో బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ (2021), సఫాయి మిత్ర సురక్షిత్ ప్రెసిడెంట్ అవార్డు (2022)లను తిరుపతి కైవసం చేసుకుంది.మరోసారి అవార్డు రావడం పట్ల కమిషనర్ హరిత హర్షంవ్యక్తంచేశారు. ఈనెల 11న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు ఆమె చెప్పారు.

వెలవెలబోయిన వైసీపీ బస్సు యాత్ర

- భోజనానంతరం జారుకున్న జనం



వెంకటగిరి వీధుల్లో సాగుతున్న బస్సుయాత్ర

వెంకటగిరి టౌన్/డక్కిలి, జనవరి 5:వైసీపీ సామాజిక సాధికార సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం వెంకటగిరి నుంచీ రాపూరు వరకూ చేపట్టిన బస్సు యాత్ర పాక్షికంగానే సఫలమైంది.యాత్రలో భాగంగా జరిగిన రోడ్‌షోకు మధ్యాహ్నం వరకూ జనం ఓ మోస్తరుగా కనిపించినా భోజనాల తర్వాత జారుకున్నారు.వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఎక్కడా జరగని రీతిలో భారీ ఎత్తున బస్సు యాత్రను విజయవంతం చేయాలని కసరత్తు చేశారు. వారం రోజుల పాటు నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు జరిపారు. గురువారం రాత్రికి జనం వచ్చే పరిస్థితి లేదని గ్రహించి ఒక్కో వలంటీరు యాభై మందిని చొప్పున బస్సు యాత్రకు తీసుకురావాలని ఆదేశించారు. బస్సు యాత్రలో సినీ నటుడు అలీ పాల్గొనడంతో అతన్ని చూసేందుకు మధ్యాహ్నం వరకూ జనం బస్సు యాత్ర వెంట బాగానే కనిపించారు. మధ్యాహ్నం భోజనాలు పెట్టాక మాత్రం ఎవరి దారిన వారు జారుకున్నారు. దీంతో తర్వాత జరిగిన బస్సు యాత్రలో జనం పలచగా కనిపించారు. కాగా వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌ను బస్సు యాత్రకు ఆహ్వానించలేదని ప్రచారమైంది. ఆమె యాత్రలో కనిపించకపోవడంతో బీసీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అన్న విమర్శలు వినిపించాయి. అలాగే బస్సు యాత్ర సందర్భంగా పోలీసుల అత్యుత్సాహంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాత్రలో రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను నియోజకవర్గ ఇంచార్జిగా నియమితుడినయ్యాక స్వల్ప వ్యవధిలోనే ఎక్కువ అభివృద్ధి చేశానన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. మార్గమధ్యంలోని డక్కిలి మండల కేంద్రంలో కమ్మపల్లి రోడ్డు సెంటరు వద్ద ముఖ్య అతిధిగా పాల్గొన్న సినీ నటుడు అలీ మాట్లాడుతూ హలో... నా పేరు అలీ అంటూ ప్రజలకు పరిచయం చేసుకున్నారు. ప్రజలు సామాన్యులు కాదని, నాయకులను ఎంతో ఆదరిస్తారని, అభివృద్ధి చేయకపోతే తోకలు కత్తిరిస్తారన్నారు.ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌రావు, నెల్లూరు మేయర్ స్రవంతి తదితరులు మాట్లాడగా తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు సునీత, సిపాయి సుబ్రమణ్యం, జిల్లా గ్రంధాలయ అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శారద, దేవాంగ కార్పోరేషన్ చైర్మన్ సురేంద్ర, స్థానిక నేతలు చింతల శ్రీనివాసులు రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కాల్తీరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, చెలికం శంకర రెడ్డి, దశరథరామిరెడ్డి, నర్రావుల ప్రకాశం నాయుడు, కోళ్లపూడి వేణుగోపాల్, కార్తీక రెడ్డి, నక్కా వెంకటేశ్వర్లు, మాడా జానకిరాం, ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా డక్కిలిలో బస్సుయాత్రకు వచ్చిన జనానికి మద్యం సరఫరా చేశారు. బస్సు యాత్ర డక్కిలిలోకి ప్రవేశించక ముందే జనం మద్యం బాటిళ్లు పట్టుకుని కనిపించారు.

రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు

వైసీపీ బస్సు యాత్రను అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. బస్సు దగ్గరకు పోనివ్వకుండా పోలీసులు అడ్డుపడడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో తిరుపతి ఎంపీ గురుమూర్తి బస్సు దిగి వారి నుంచీ వినతి పత్రం స్వీకరించారు. అంగన్వాడీల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, పైగా సమస్య వినాలని శాంతియుతంగా కోరిన మహిళలను పోలీసుల ద్వారా నెట్టించడం దారుణమంటూ సీఐటీయూ నేత చెంగయ్య మండిపడ్డారు.



లడ్డూ మూడు రోజులకే

పాడైపోతోంది

తిరుమల గదుల్లో గీజర్లు పనిచేయడం లేదు

డయల్ యువర్ ఈవోలో భక్తుల ఫిర్యాదులు



తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గతంలో పదిపదిహేను రోజులు నిల్వ ఉండే లడ్డూలు ప్రస్తుతం మూడునాలుగు రోజులకే పాడైపోతున్నాయని బెంగళూరుకు చెందిన మురళి, పిఠాపురానికి చెందిన వెంకట్ శుక్రవారం తిరుమలలో జరిగిన డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. లడ్డూలు నాణ్యత లేదని, చక్కెర అధికంగా ఉండటంతో పాటు సువాసన తగ్గిపోయిందని ఫిర్యాదు చేశారు. ఈవో స్పందిస్తూ లడ్డూల విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఎప్పటి నుంచో ఉన్న శ్రీవైష్ణవ బ్రాహ్మణులే వాటిని తయారు చేస్తున్నారని, నిత్యం వారికి పలు సూచనలు ఇస్తున్నామని అన్నారు. ఇకపై లడ్డూల నాణ్యత విషయంలో మరింత శ్రద్ధ వహిస్తామన్నారు. తిరుమలలో పావురాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ కారణంగా శ్వాస సమస్యలు ఎదురయ్యే అవకాశముందని అనురాధ (నాయుడుపేట) ఈవో దృష్టికి తీసుకురాగా సమస్యపై పరిశీలన చేస్తామని బదులిచ్చారు. కాటేజీల్లో గీజర్లు ఉన్నా పనిచేయడం లేదని జగన్(హైదరాబాద్), మునిలక్ష్మి (నెల్లూరు). గిరన్న (ఆదోని) ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఈవో బదులిచ్చారు. తిరుమల టీదుకాణాల్లో మట్టి గ్లాసులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని పురుషోత్తం(గుంటూరు) సూచించగా యజమానులతో మాట్లాడి అవగాహన కల్పిస్తామన్నారు.

లారీని ఢీకొన్న బస్సు

ఇద్దరు డ్రైవర్ల దుర్మరణం ● నలుగురికి గాయాలు



క్రేన్ సాయంతో లారీ డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు



దినేష్ ప్రతాప్ సింగ్ మృతదేహం

పెళ్లకూరు, జనవరి 5: లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి.పెళ్లకూరు మండలం లోని కొత్తూరు వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.... గురువారం మధ్యాహ్నం ఛత్తీస్‌గడ్ రాష్ట్రం జగదల్‌పూర్ నుంచి ఓ ట్రావెల్స్ బస్సులో 20మంది విహారయాత్రకు బయలుదేరారు. శుక్రవారం ఉదయం కొత్తూరు వద్ద అదుపుతప్పిన బస్సు తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి నెల్లూరుకు కంకర లోడుతో వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ముంబాయికి చెందిన బస్సు డ్రైవర్ దినేష్ ప్రతాప్ సింగ్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. తమిళనాడులోని విల్లిపురానికి చెందిన లారీ డ్రైవర్ ఇలగవరన్ (55) లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు రెండు క్రేన్ల ద్వారా అతికష్టమ్మీద బస్సును లారీని విడదీసి డ్రైవర్‌ను బయటకు తీశారు. తీవ్ర గాయాలతో క్యాబిన్‌లో డ్రైవర్ గంటన్నరకు పైగా నరకయాతన అనుభవించిన ఇలగవరన్ నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలకు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పజెప్పనున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.బస్సులో నలుగురు గాయపడగా నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్సలందించారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గంగమ్మ గుడిలో గోల్‌మాల్

వేళ్లన్నీ పాలకమండలి వైపే

● జమాఖర్చులకు వీరి ఆమోదం తప్పనిసరి ● అప్పుడు మౌనంగా ఉండడం వల్లే ఇప్పుడు భారీ మూల్యం
● దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ది కూడా ఇదే దారి ● బాధ్యత ఉండక్కర్లేదా అంటూ భక్తుల మండిపాటు



తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై వేళ్లన్నీ ఆలయ ధర్మకర్తలమండలి వైపే చూపిస్తున్నాయి. అమ్మవారికి భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలకు జవాబుదారీతనంగా వ్యవహరించాల్సిన పాలకమండలి ఛైర్మన్, సభ్యులు ఉత్సవ విగ్రహాల్లా మారారన్న చర్చ జరుగుతోంది.అధికారిక లెక్కల్లోనే రూ.52 లక్షలు మాయమైనప్పటికీ పాలక మండలి మౌనంగా ఉండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. దేవదాయ శాఖ చట్టం ప్రకారం ధర్మకర్తల మండలికి కీలకమైన అధికారాలుంటాయి. సభ్యుల సమన్వయంతో ఛైర్మన్ ప్రధాన భూమిక పోషిస్తుంటారు. ప్రతి నెలా జరిగే పాలకమండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలనే కార్యనిర్వహణాధికారి అమలుచేయాల్సి ఉంటుంది. నెలలో దేనికోసం ఎంతెంత ఖర్చుపెట్టారో జమాఖర్చుల వివరాలను తెలియపరిచి సభ్యుల ఆమోదం తీసుకోవాలి. అవసరానికి మించి ఖర్చు పెట్టివుంటే సమీక్షించి చర్యలు తీసుకునే అధికారం కూడా పాలకమండలికి ఉంది. అయితే గంగమ్మ ఆలయ పాలకమండలి మాత్రం ఇవేమీ పట్టనట్టుగా అమ్మవారిని దర్శనం చేసుకోవడం, తెలిసినవారికి దర్శనం చేయించి పసుపు,కుంకుమలను అందజేయడం వరకే పరిమితమైందన్న ఆరోపణలున్నాయి. ఆలయ సిబ్బందికి జీతాలు సక్రమంగా వస్తున్నాయా? లేదా? కూడా వీరికి తెలియదు. అదేవిధంగా ఆలయంలో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగికి మాత్రమే భారీగా జీతం పెంచిన విషయం ధర్మకర్తల మండలికి తెలియకపోవడం పలు విమర్శలకు దారితీసింది. అంతెందుకు తుడా కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న ఆలయ ఆర్చి గురించి కూడా వీరిదగ్గర ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. ఈ పరిణామాలపై ఇప్పటికే పాలకమండలిలో పలువురు అసంతృప్తిగా ఉన్నారు.తమ హయాంలో గంగమ్మ ఆలయంలో గోల్‌మాల్ జరిగిందన్న అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తోందని మధనపడుతున్నారు. చేసిందెవరో, చేయించిందెవరో....అన్నీ గంగమ్మకు తెలుసంటూ వైరాగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.

వీరిపైన చర్యలేవీ?

గంగమ్మ ఆలయంలో గత మార్చి ఆర్థిక సంవత్సరానికి జరిపిన ఆడిట్‌లో రూ.17 లక్షలు తేడా కనిపించింది. జాతరకు నెలముందే ఇంత తేడా వచ్చినప్పుడు దేవదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్, సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్, ఆర్జేసీ ఏమీ మాట్లాడకుండా మౌనం దాల్చడం పలు అనుమానాలకు తావిస్తోంది. వీరిలో పలువురిని 'సంతృప్తి' పరచడంతో పాటు అధికార పార్టీ పెద్దల తరపున వత్తిడి తీసుకురావడం, జాతర తర్వాత లెక్కలు చూసుకుంటామని చెప్పడం వలనే చూసీ చూడనట్టుగా ఉన్నారన్న విమర్శలున్నాయి.ముఖ్యంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పూర్తిగా విఫలమయ్యారని చెబుతున్నారు. మరి వీరిపై చర్యలు లేకుండా 'అంతా చేసింది' అతనే అంటూ చనిపోయిన ఇన్‌చార్జి ఈవో మునికృష్ణయ్యపై నెట్టేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.ఇంట్లో పెద్దదిక్కు పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఈవో కుటుంబంపైనే భారం మొత్తం వేస్తామనడం భావ్యం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఆర్జేసీ (ప్రాంతీయ సంయుక్త కమిషనర్) సత్యనారాయణ మూర్తి మీడియానుద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 'గంగమ్మ గుడిలో గోల్‌మాల్' పై ఈవో బతికివున్నప్పుడు ఎందుకు వార్తలు రాయలేదని, అప్పుడు అవినీతి కనిపించలేదా అంటూ మీడియాను ఆయన ప్రశ్నించారు.జరిగిన తప్పులను పర్యవేక్షించేందుకు పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, ఆలస్యంగానైనా బయటపెట్టిన మీడియాపై అక్కసు వెళ్లగక్కడం ఏమిటనడంతో తాను కొత్తగా వచ్చానని, ఇక్కడ ఏం జరుగుతుందో పూర్తిగా తెలియదని చెప్పుకొచ్చారు.

రాయలపురం సమస్యలను పరిష్కరిస్తాం



చంద్రగిరి, జనవరి 5: చంద్రగిరి మండలం రాయలపురంలో శుక్రవారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా నేత పులివర్తి సుధారెడ్డి ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాయలపురం పంచాయతీలో డ్రైనేజీ సమస్య వల్ల దోమలు విజృంభించి తరుచూ రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే రాయలపురం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చంద్రగిరిలో నేరాలు తగ్గాయ్: ఎస్పీ

చంద్రగిరి, జనవరి 5: చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ పరమేశ్వరరెడ్డి తనిఖీ చేసారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చంద్రగిరి మండలంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే చోట ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. చంద్రగిరిలో గతంలో కంటే ఇప్పుడు 26 శాతం నేరాలు తగ్గినట్లు తెలిపారు. డీఎస్పీ యశ్వంత్, సీఐ రాజశేఖర్, ఎస్ఐలు హిమబిందు, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం

చంద్రగిరి, జనవరి 5: చంద్రగిరి పంచాయతీలోని ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో బాలాజీనాయక్, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ చేగు గోవర్ధన్‌గుప్తా, సింగిల్‌విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, సర్పంచ్ రూపారామ్మూర్తి, ఎంపీటీసీ మాదవరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు.

ఎల్లమ్మ ఆలయంలో దాతలకు సన్మానం



చంద్రగిరి, జనవరి 5: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో పట్టణానికి చెందిన చేగు లక్ష్మీనారాయణగుప్తా, వైసీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్‌గుప్తా, కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, పాలకమండలి సభ్యులు, దాతలను ఘనంగా సన్మానించారు.

గ్రామం చుట్టూ ప్రహరీలు నిర్మించేస్తున్నారు

చంద్రగిరి, జనవరి 5: గ్రామం చుట్టూ పొలందారులు ప్రహరీలు నిర్మించడం వల్ల కనీసం గాలి కూడా రావడంలేదని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మామండూరు హరిజనవాడవాసులు శుక్రవారం తహసీల్దార్ శిరీషాకు వినతిపత్రం ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామం చుట్టూ ఇప్పటికే మూడు దిక్కులా అగ్రవర్ణాలు పెద్ద ఎత్తున ప్రహరీలు నిర్మించారని, ఇప్పుడు మరో దిక్కు కూడా ప్రహరీ నిర్మిస్తున్నారని, తమ గ్రామాన్ని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో పర్యటించి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఇన్‌చార్జ్ గోపిమాదిగ, నాయకులు మద్దల ప్రసాద్, కాగితాల మహేష్, అశోక్, మాజీ సర్పంచ్ నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పగటి పూటే విద్యుత్ సరఫరా

భాకరాపేట, జనవరి 5: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తును పగటి పూట సరఫరా చేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ డైరెక్టర్(టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్డీ) సుబ్బరాజు అన్నారు. చిన్నగొట్టిగల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి పగటి పూట రెండు విడతలుగా తొమ్మిది గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లకు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 1912కు తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఈఈ మునిచంద్ర, డిప్యూటీ ఈఈ శివయ్య, ఏఈ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో నటుడు రామచంద్రరాజు



తిరుచానూరు, జనవరి 5: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారిని సినీనటుడు (కేజీఎఫ్ ప్రతినాయకుడు) రామచంద్రరాజు దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ శేషగిరి ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు.

వైభవంగా సరస్వతి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

ఎర్రావారిపాలెం, జనవరి 5: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం8 గంటల నుంచి 1 గంట వరకు ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, పీఎంసీ ఛైర్మన్ రవీంద్రనాథ రెడ్డి, జడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి చెంగల్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, సునీల్, రాజారెడ్డి, హరినాథరెడ్డి, సుబ్రమణ్యం, ఎంఈవోలు సతీశ్‌బాబు, పీవీ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోతే పతనమే



చంద్రగిరిలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ వర్కర్లు

చంద్రగిరి, జనవరి 5: అంగన్వాడీ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. అంగన్వాడీ వర్కర్ల సమ్మె చంద్రగిరిలో శుక్రవారం 25వ రోజుకు చేరింది. సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు 25 రోజులుగా సమ్మె చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ, ప్రియదర్శిని, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ, పద్మిని, సుజాత, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

విద్వాస్ స్కూల్లో అలరించిన గీతావధానం



పండితులను సత్కరిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం

చంద్రగిరి, జనవరి 5: శ్రీనివాసమంగాపురం సమీపంలోని విద్వాస్ స్కూల్లో హేమ వెంకటనారాయణ చేసిన గీతావధానం అందరినీ అలరించింది. శుక్రవారం విద్వాస్ స్కూల్లో గీతావధానం కార్యక్రమం జరిగింది. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఎస్వీయూ పూర్వాచారులు కందనూరు శేషయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బాల్యం నుంచి భగవద్గీతను నేర్చుకోవడం, ఆచరించడం పిల్లల వ్యక్తిత్వ వికాసానికి కారణమవుతుందని తెలిపారు. శ్లోక సంఖ్య చెబితే శ్లోకాన్ని చెప్పడం, అక్షర సంఖ్య చెప్పడం విలోమంగా శ్లోకాన్ని చదవడం, అఖండ పారాయణ చేయడం తదితర అంశాలను అవధాని వెంకటనారాయణ వివరించాడు. విద్యార్థులు, అధ్యాపకులు ప్రశ్నలను అడగ్గా అవధాని ఎంతో చక్కగా సమాధానాలను చెప్పి మెప్పించాడు. అనంతరం విద్వాస్ విద్యాసంస్థల ఛైర్మన్ జయచంద్రారెడ్డి విద్యార్థుల జీవన వికాసానికి రామాయణం, భగవద్గీత ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఛైర్మన్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పండితులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధ్యాపకులతో పాటు ప్రాశ్నికులుగా మద్దూరి ఆదిత్యశర్మ, అరుణాచలరెడ్డి, సుకుమార్‌రెడ్డి, చరిత, వేంకటేశ్వర్లు, విద్వాన్ గోపికృష్ణారెడ్డి, ఆముదాల మురళి, తదితరులు పాల్గొన్నారు.

పూత వచ్చిన మామిడి తోటల్లో సస్యరక్షణ చేపట్టాలి



మొగరాలలో మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారిణి శైలజ

పాకాల, జనవరి 5: పూత వచ్చిన మామిడితోటల్లో సస్యరక్షణ చేపట్టాలని ఉద్యాన అధికారిణి ఎస్‌శైలజ అన్నారు. మొగరాల పంచాయతీ పరిధిలో శుక్రవారం ఆమె మామిడి తోటలను పరిశీలించారు. రాత్రి, పగటి ఉష్ణోగ్రతల మధ్య తేడా 10 డిగ్రీల కంటే తక్కువ వున్నపుడు మామిడిలో పూత వచ్చే అవకాశముందన్నారు. 10 డిగ్రీల కంటే ఎక్కువయినపుడు పూత మొగ్గగా మారే అవకాశం వుండి చిగుర్లు వస్తాయన్నారు. తోతాపురి, ఖాదర్ రకాలు కొన్ని మామిడి తోటల్లో పూత వచ్చిందన్నారు. పూత అంతా ఒకేసారి రావడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, ఆర్కా మాంగో స్పెషల్ 5 గ్రాములు, లేదా బోరాన్ 1గ్రాము, మోనో క్రోటో పాస్ 1.6మిల్లీ లీ లీటరు నీటికి చొప్పున కలిపి స్ప్రే చేయాలన్నారు. రైతులు మామిడిలో మొదటి స్ప్రేలో పైరే త్రాయిడ్స్ మందులు ఎక్కువగా వాడడంతో తేనె మంచు పురుగు ఉధృతి ఎక్కువై ఎండు పుల్ల అధికమయ్యే అవకాశం వుందన్నారు. లాంబ్డా సహలోత్రిన్, సైపర్ మెత్రిన్ లాంటి పైరేత్రాయిడ్ పురుగు మందులు వాడకూడదన్నారు. మామిడిలో రెండవ పిచికారి పూత వచ్చాక మొగ్గదశలో భుప్రోపెజిన్ ఇసిపేట్ 1గ్రాము, లేదా పైమెట్రోజైన్ 0.6గ్రాములు, హెక్సాకోనాజోల్ 2 మిల్లీ లేదా కార్బండిజమ్ మాంకోజబ్ 1.5గ్రాములు, ప్లానోఫిక్స్ 0.25 మిల్లీ లీటర్లు, జిగురు 0.5మిల్లీ లీ 1లీ నీటికి కాండము చెట్టుకొమ్మ తడిచేలా పిచికారి చేయాలన్నారు. పూత దశలో ఆశించే తేనె మంచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులును సమర్థవంతంగా నివారించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు గౌరీశంకర్

సీఎంపై తహసీల్దారు ప్రశంసలు..!

వరదయ్యపాళెం, జనవరి 5: సీఎం జగన్‌పై వరదయ్యపాళెం తహసీల్దారు గౌరీ శంకర్ ప్రశంసలు కురిపించారు. వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు గౌరీశంకర్ మాట్లాడుతూ సీఎం పేదల పక్షపాతి అని రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. జగన్ ప్రవేశపెట్టిన పథకాలు అమలు అవుతాయో లేదో అని కొందరు విమర్శలు చేశారని ఇపుడు వాటిని పక్కరాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకుంటు న్నారన్నారు. ఉద్యోగులకు జీతాలు ఆగినా పేదలకు మాత్రం పింఛన్లు ఆపడం లేదన్నారు. సీఎం ఇచ్చిన హామీ రూ.3వేలు అని నాలుగు విడతలుగా రూ.2వేలు నుంచి రూ.3వేలుకు చేర్చడం గర్వకారణమన్నారు. కాగా బాధ్యత గల తహసీల్దారు ఇలా ఓ పార్టీ కార్యకర్తలా మాట్లాడడం తగదని జనం చర్చించుకుంటున్నారు.

ఈసారి టీడీపీదే విజయం : పులివర్తి నాని



కార్యక్రమంలో పాల్గొన్న పులివర్తి నాని, ఈశ్వర్‌రెడ్డి

తిరుపతి రూరల్, జనవరి 5: చంద్రగిరిలో ఈసారి టీడీపీదే విజయమని ఆ పార్టీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. అవిలాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 25 ఏళ్ల చరిత్రను ఈ దఫా తిరగరాస్తామన్నారు. తాను ఎమ్మెల్యే అయితే అవిలాల రూపురేఖలు మారుస్తానన్నారు. నగరానికి ఆనుకొని ఉన్న అవిలాలలో పారిశుధ్యం లోపించిందన్నారు. గ్రామంలో ఎలాంటి ప్రగతి కన్పించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించవలసిన ఎమ్మెల్యే ముఖం చాటేస్తున్నారన్నారు. వర్షాకాలంలో నీళ్లు నిలిచి జనం అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ పార్థసారథి రెడ్డికి అభినందన



తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో ఓ భక్తుడికి అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డిని శుక్రవారం సహచర వైద్యులు సత్కరించారు. గతనెల 30న తిరుమల శ్రీవారి దర్శన క్యూ కాంప్లెక్సులో హఠాత్తుగా అరవై ఏళ్ల భక్తుడు అపస్మారక స్థితికి వెళ్లాడు. అక్కడున్న వారంతా ఆందోళన చెందుతుండగా తన వైద్య బృందంతో వైకుంఠ దర్శనం కోసం వెళ్లిన డాక్టర్ పార్థసారథి రెడ్డి సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్) పద్ధతితో ప్రాణాలు నిలబెట్టారు. దీంతో అక్కడున్న భక్తజనం వైద్యబృందాన్ని అభినందించారు.సమయస్ఫూర్తితో వ్యవహరించి భక్తుడిని కాపాడి నందుకుగాను డాక్టర్ పార్థసారథిని వైద్యులు సత్కరించారు.

నవరత్నాలతో మరో రూ.4.38 కోట్ల లబ్ధి

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 5 : ద్వైవార్షిక నవరత్నాల సంక్షేమ పథకాలతో జిల్లాలోని 3,009మందికి రూ.4.38కోట్లు లబ్ధి చేకూరినట్లు డీఆర్వో కిషోర్ తెలిపారు. సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి కూడా లబ్ధి పొందని వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి జనవరి నుంచి జూన్ వరకు అమలైన పథకాలకు సంబంధించిన లబ్ధిని జూన్/జూలైలో, జూలై నుంచి డిసెంబరు వరకు అమలైన పథకాలకు సంబంధించిన లబ్ధిని డిసెంబరు/జనవరి నెలల్లో వారి ఖాతాల్లో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం లబ్ధిదారులకు డీఆర్వో కిషోర్,డీఆర్డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ నమూనా చెక్కు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భాకరాపేట, జనవరి 5: పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు భాకరాపేట ఇన్‌చార్జ్ ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం పంచాయతీ బద్దలవారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.46,360 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

టీటీడీ ట్రస్టులకు రూ.40 లక్షల విరాళం

తిరుమల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు శుక్రవారం రూ.40 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన కేవీ రాజశేఖర్‌కు చెందిన జేకేసీ ప్రాజెక్ట్స్ తరపున ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు అందాయి. అన్నప్రసాదం ట్రస్టుకు కొల్లి గోపాలకృష్ణ, మాధవ రూ.20 లక్షలు అందజేయగా ఢిల్లీకి చెందిన శివంగ్ కౌర్ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు.దాతల ప్రతినిధులు మణిరెడ్డి, తిరుపతికి చెందిన రాఘవేంద్ర విరాళపు డీడీలను తిరుమలలో టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

బాధ్యులను వదిలి నన్ను బలి పశువును చేశారు

మద్యం సేల్స్‌మేన్ ఆందోళన



తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కల్తీ, కాలం చెల్లిన మద్యం విక్రయం కేసులో బాధ్యులను వదిలి తనను బలి పశువును చేశారంటూ శ్రీకాళహస్తికి చెందిన హేమచంద్రారెడ్డి శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగాడు. తాను శ్రీకాళహస్తిలోని ఒక మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేసేవాడినని, స్థానికంగా ఉండే ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కాలం చెల్లిన, కల్తీ మద్యం విక్రయించాలని ఒత్తిడి తెచ్చేవాడని, పైగా తమ వద్ద మామూళ్లు తీసుకునేవాడని చెప్పారు. ఇందులో ఎక్సైజ్ అధికారుల ప్రమేయం కూడా ఉందన్నారు. ఆయన చెప్పిన పని చేయలేదనే కోపంతో లేనిపోని ఆరోపణలు చేసి, తనను మూడు నెలల క్రితం విధుల నుంచి తొలగించారన్నారు. బాధ్యులను వదిలి తనను అనవసరంగా బలి పశువును చేశారంటూ కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరామ్ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి బైఠాయించాడు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ దాదాపు అరగంట పాటు నినాదాలు చేశాడు. సెక్యూరిటీ సిబ్బంది ఆయన్ను బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఆరోపణలు రావడంతో మూడు నెలల క్రితం అతన్ని విధుల నుంచి తొలగించామని, హెడ్ కానిస్టేబుల్‌పై విచారణ జరుపుతున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరామ్ తెలిపారు.

తిరుచ్చిపై పద్మావతిదేవి అభయం

తిరుచానూరు, జనవరి 5: తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారు శుక్రవారం రాత్రి తిరుచ్చిపై ఊరేగి భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో అమ్మ వారిని అర్చకులు మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిపించారు. ఇక మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి వేదమంత్రోచ్చరణల నడుమ తిరుమంజనం నిర్వహించారు. సర్వ అలంకార శోభితురాలైన పద్మావతి దేవి తిరుచ్చిపై కొలువుదీరి నాలుగుమాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏపీఎస్‌ఏవో శైలేంద్రబాబు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్‌లు శేషగిరి, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు



తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో 25 రోజుల పాటు జరిగిన అధ్యయనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని వేంచేపు చేసి దివ్యప్రబంధగోష్ఠి నిర్వహించారు.

ధార్మిక సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయండి

తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుమల ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధార్మిక సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుమలలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సుకు హాజరయ్యే మఠాధిపతులకు, పీఠాధిపతులకు దర్శనం, వసతి, రవాణా ఏర్పాటు చేయాలన్నారు.జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, సీఈ నాగేశ్వరరావు, డీపీపీ కార్యదర్శి సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

తిరుపతి(విద్య), జనవరి 5 : జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్య విద్యార్థులు అంతర్జాతీయస్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో(ఐఎన్‌టీఎస్‌వో) విజయ ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ పేర్కొన్నారు. డిసెంబరులో నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో లెవల్-1 పరీక్షని తమ పాఠశాలకు చెందిన 400 మంది విద్యార్థులు రాయగా 346 మంది సెకండ్ లెవల్‌కి ఎంపికైనట్లు తెలిపారు. ఎంటీఎస్‌వోకు 94మంది, ఏటీఎస్‌వోకు 18, ఈటీఎస్‌వోకు 75, ఎస్‌టీఎస్‌వోకు 95, జీటీఎస్‌వోకు 64మంది అర్హత సాధించారని వివరించారు. విద్యార్థులను ఏజీఎం జి.సురేష్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, డీన్ సురేష్, టీచర్లు అభినందించారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు

మతోన్మాద బీజేపీని ఓడిద్దాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

తిరుపతి(కొర్లగుంట), జనవరి 5 : మతోన్మాద బీజేపీని ఓడించి, దేశాన్ని కాపాడుకుందామని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు రాఘవశర్మ, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పి.అంజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, పదేళ్లుగా ప్రజలు తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాలకులు భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నారన్నారు. ఎవరు అడ్డువచ్చినా అడ్డుకట్ట వేస్తామనే అహంకార పూరిత విధానాన్ని అనుసరిస్తున్నారన్నారు. దీన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా వెంకటయ్య, చిన్నం పెంచలయ్య, అర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, రచయిత గొడుగు చింతల గోవిందయ్య, డీఎంసీ భాస్కర్ పాల్గొన్నారు.

జనసేనలో చేరిన తిరుపతి యువకులు



తిరుపతి(కొర్లగుంట), జనవరి 5: తిరుపతికి చెందిన పలువురు యువకులు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. బైరాగిపట్టెడలోని పార్టీ కార్యాలయం వద్ద 18, 19, 35 డివిజన్లకు చెందిన 50 మంది యువకులకు పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ జనసేనాని పవన్‌కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి యువకులు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు బాబ్జి, ప్రధాన కార్యదర్శి కొండా రాజమోహన్, కిషోర్, హిమవంత్, సాయిదేవ్, మనోజ్, షరీఫ్, వంశీ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు

తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 59,522 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,544 మంది తలనీలాలు సమర్పించారు.

బ్రిడ్జ్ టోర్నమెంట్ విజేత తిరుపతి సర్కిల్



విజేతలను అభినందిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ వాసుదేవరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 5 : శ్రీశైలంలో డిసెంబరు 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి విద్యుత్ బ్రిడ్జ్, చెస్ పోటీల్లో తిరుపతి ఇంటర్ సర్కిల్ క్రీడాకారులు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారు. బ్రిడ్జ్ పోటీల్లో ప్రభాకర్ రెడ్డి, శంకర్, అమీర్‌బాషా, రెహమాన్, శంకర్‌రెడ్డి ప్రథమ, చెస్ పోటీల్లో ఆర్.సేతురామన్ తృతీయ స్థానంలో నిలిచారు. తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం వారిని అభినందించారు. విద్యుత్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీ ఆర్.పురుషోత్తం, ట్రెజరర్ నీలారామ్ పాల్గొని అభినందనలు తెలిపారు.

ఎస్వీయూ ప్రొఫెసర్ మృతి



ప్రొఫెసర్ జాకబ్‌దాస్ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 5 : ఎస్వీయూ జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జాకబ్‌దాస్ (61) శుక్రవారం మృతి చెందారు. షుగర్ తీవ్రతతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కొన్ని రోజులు చికిత్స పొందారు. ఈ క్రమంలో అనారోగ్యం రావడంతో చెన్నై అపోలోకు తరలించే క్రమంలో మార్గమధ్యంలో కన్నుమూశారు. తిరుపతిలోని అమరావతి నగర్‌లో నివాసముంటున్నారు. నంద్యాలకు చెందిన జాకబ్‌దాస్ ఎస్వీయూలోనే పీహెచ్‌డీ పూర్తి చేసి 1992లో ఎస్వీయూ అనుబంధ కావలి పీజీ కేంద్రంలో అధ్యాపకుడిగా చేరారు. ఆయన పర్యవేక్షణలో 29 పీహెచ్‌డీలు, 11 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. 2002లో మలేషియాను సందర్శించారు. 4 యూజీసీ రీసెర్చ్ ప్రాజెక్టులను పూర్తి చేశారు. 80 పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 3 పుస్తకాలు రాశారు. యూనివర్సిటీ హాస్టల్ వార్డెన్‌గా, జువాలజీ విభాగాధిపతిగా వ్యవహరించారు. ఇలా 30 ఏళ్లకు పైగా బోధన, పరిశోధనా రంగాల్లో కృషి చేశారు. జాకబ్‌దాస్ మృతి పట్ల ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. శనివారం నంద్యాలలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

దక్షిణాది వర్సిటీల వీసీల సదస్సుకు ప్రొఫెసర్ భారతి



సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 5 : దక్షిణాది యూనివర్సిటీల వీసీల సదస్సులో పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రం తంజావూరులో గల సస్త్ర యూనివర్సిటీలో యూజీసీ చేపట్టిన ఈ సదస్సులో నూతన జాతీయ విద్యా విధానం - 2020 గురించి చర్చించారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి అంశంపై భారతి ప్రసంగించారు. చర్చాగోష్ఠిల్లోనూ పాల్గొన్నారు. ఈ సదస్సులో యూజీసీ ఛైర్మన్ జగదీష్ పాల్గొనగడం గమనార్హం.

గంజాయి విక్రేతల అరెస్టు

నగదు, 5కిలోల గంజాయి స్వాధీనం



తిరుపతి(నేరవిభాగం), జనవరి 5 : రేణిగుంట ఫ్లైఓవర్ సమీపంలో గంజాయి విక్రయిస్తూ ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు... రేణిగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి, పోస్టల్‌కాలనీ క్రాస్ వద్ద అనుమానంగా తచ్చాడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా 5 కిలోల గంజాయి, రూ.లక్ష నగదు కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా పాడేరులో కొనుగోలు చేస్తామని, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి నగరం చుట్టుపక్కల ప్రాంతాలలో విక్రయిస్తున్నామని అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 5 : జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి శుక్రవారం తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన వారు 19 నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

10నుంచి అధ్యయనోత్సవాలు

తిరుపతి (కల్చరల్), జనవరి 5: గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏటా ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయంలో దివ్యప్రబంధ పారాయణం జరుగుతుంది. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామి, సేనాధిపతి, ఆళ్వారులను వేంచేపు చేస్తారు. అక్కడ పారాయణం జరుగుతుంది. జనవరి 20న చిన్నశాత్తుమొర, 30న పెద్దశాత్తుమొర నిర్వహిస్తారని టీటీడీ వెల్లడించింది.

రేపటి నుంచి ఆండాళ్ నీరాటోత్సవం

గోవిందరాజస్వామి ఆలయంలో ఆదివారం నుంచి 13వ తేదీ వరకు ఆండాళ్ నీరాటోత్సవం నిర్వహించనున్నారు. శుక్రవారం గోవిందరాజస్వామిని ఊరేగింపుగా శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు తీసుకువెళతారు.

నైపుణ్యాభివృద్ధి అధికారిగా లోకనాథం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 5 : జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా ఆర్.లోకనాథం నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. శుక్రవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో స్కిల్‌హబ్స్, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు, నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాలు నిర్వహించడంపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు.

జనసేనలోకి కాణిపాక ఆలయ మాజీ చైర్మన్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 5: కాణిపాక ఆలయ మాజీ చైర్మన్ రాజకుమార్ శుక్రవారం జనసేనలో చేరారు. స్థానిక పీఏసీ కార్యాలయంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భానుప్రసాద్, బాటసారి, పార్థు, కిరణ్‌కుమార్, మనోజ్‌కుమార్, గౌస్‌బాషా, మోహిత్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

మా ప్రహరీ కూల్చేశారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 5: తమ స్థలంలో వున్న టేకు చెట్టును నరికివేయడంతో పాటు ప్రహరీని కూల్చివేశారంటూ పాత తిరుచానూరు రోడ్డు అశోక్‌నగర్‌లో హెచ్.పి. గ్యాస్ ఏజన్సీ నిర్వహిస్తున్న అజయ్‌ప్రతాప్ ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఇందుకు కారకులుగా ఎం.ఆర్. పల్లి మాజీ సర్పంచి మమత, మాసి కృష్ణమూర్తిలను ఆయన ఫిర్యాదులో పేర్కొనడంతో ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేతనాలు పెంచితేనే విధుల్లోకి..

- ప్రభుత్వానికి అంగన్వాడీల స్పష్టీకరణ



అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్న మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ నాయకులు

తిరుపతి (రవాణా), జనవరి 5 : 25 రోజులుగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, వేతనాలు పెంచితేనే విధుల్లోకి వస్తామని అంగన్వాడీ వర్కర్లు స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా పాత మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు శుక్రవారం మంత్రుల ఫొటోలు పెట్టుకుని కూరగాయల బేరం చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి.రామకృష్ణ, 108, 104 నాయకులు మద్దతు ప్రకటించి, కమలాపండ్లు పంపిణీ చేశారు. టి.రామకృష్ణ, 108 యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్.మునిరాజా మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుండా విధుల్లో రావాలని ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో కార్మికులందరం ఏకమై ప్రభుత్వ మెడలు వంచాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, రాజేష్, నాగరాజు, విజయ్, అంగన్వాడీ నాయకులు నాగరాజమ్మ, జయప్రభ, ఎల్లమ్మ, గీత, సుజిత, సుశీల, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

బలిజ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



తిరుపతి(ఆటోనగర్), జనవరి 5 : ఉమ్మడి చిత్తూరు జిల్లా బలిజ ఉద్యోగుల (విద్యుత్) అభ్యుదయ సేవా సమితి డైరీని శుక్రవారం తిరుపతి యూత్ హాస్టల్‌లో ఆవిష్కరించారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు నీలం నరేంద్రనాథ్, అశోక్‌కుమార్, పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల పరస్పర సహకారమే సమితి ధ్యేయమన్నారు. సమితి అభ్యున్నతికి బలిజ ఉద్యోగులందరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు లక్ష్మీనారాయణ, రవికుమార్, అమర్‌బాబు, బాలాజీ, లక్ష్మీప్రసాద్, చంద్రశేఖర్, శ్రీలక్ష్మి, ప్రసాద్, మునిచంద్రయ్య, సత్యనారాయణ, మధుసూదన్, జయప్రకాష్ పాల్గొన్నారు.

కార్మిక చైతన్య బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో టెక్కలి నుంచి కుప్పం వరకు కార్మిక చైతన్య బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ శుక్రవారం టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసం వద్ద జరిగింది. ఆమె మాట్లాడుతూ యాత్రలో రాష్ట్ర ప్రజలందరూ పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు. టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి కలయికతో విజయం సాధించడం తథ్యమన్నారు. టీఎన్‌టీయూసీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కరాటే చంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, బుల్లెట్ రమణ, చినబాబు, మహేష్ యాదవ్, మునిశేఖర్ రాయల్, లక్ష్మీపతి నాయుడు, ఆముదాల తులసి, రాజయ్య, జనార్దన్ రాయల్, రెడ్డెప్ప నాయుడు, గంధం బాబు, విశ్వనాథం, అశోక్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ వీసీకి అభినందన



వీసీని అభినందిస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్

తిరుపతి(విద్య), జనవరి 5 : ఎస్వీయూ వీసీగా నియమితులైన ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డిని ఎమరాల్డ్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం పాల్గొన్నారు.

ఘనంగా పరమహంస యోగానంద జయంతి



తిరుపతి (కల్చరల్), జనవరి 5 : తిరుపతికి చెందిన యోగద సత్సంగ్ ధ్యాన మండలి (వైఎస్ఎస్‌డీఎం) ఆధ్వర్యంలో పరమహంస యోగానంద 131వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీపురం కాలనీలోని మాలయాళ సద్గురు సేవా సమాజంలో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ జన్మోత్సవ ధ్యాన శిబిరంలో తిరుపతి వైఎస్ఎస్‌డీఎం సంచాలకుడు, పశువైద్య నిపుణుడు ఆచార్య డి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ప్రకాశం నాయుడు, సభ్యులు ఆచార్య పి.సుబ్రమణ్యం, ఆచార్య ఎస్.రాజేశ్వరి, కార్యదర్శి డి.సుబ్రమణ్యం, సహ కార్యదర్శి శ్రీరాములు, శేషాచలపతి, హేమలత, ఆచార్య పి.రాజశేఖర రెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, జనవరి 5: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన వెంకటగిరిలో 'రా... కదలిరా...' పేరిట నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో వెంకటగిరి, డక్కిలి మండలాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి జన సమీకరణపై చర్చించారు. అనంతరం తిరుపతి - వెంకటగిరి రోడ్డు మార్గంలో సభ నిర్వహించే ప్రాంతాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి కురుగొండ్ల పరిశీలించారు. జనసేన నాయకులు తోటా కృష్ణయ్య, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, భీరం రాజేశ్వరావు, చెంచయ్య, రమేష్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, జన్ని రమణయ్య, అవ్వారు సత్యనారాయణ, ఏలేశ్వరం రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

గూడూరు, జనవరి 5: వెంకటగిరిలో ఈనెల 9వ తేదీన జరగనున్న చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగసభను జయప్రదం చేద్దామని గూడూరు నియోజకవర్గ పరిశీలకుడు పెళ్లకూరు శ్రీనివాసులరెడ్డి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీన వెంకటగిరిలో జరగనున్న బహిరంగసభకు నియోజవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు సైకో ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకవిధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకుని రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

నవరత్నాలతో మరో రూ.4.38 కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 5 : ద్వైవార్షిక నవరత్నాల సంక్షేమ పథకాలతో జిల్లాలోని 3,009మందికి రూ.4.38కోట్లు లబ్ధి చేకూరినట్లు డీఆర్వో కిషోర్ తెలిపారు. సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి కూడా లబ్ధి పొందని వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి జనవరి నుంచి జూన్ వరకు అమలైన పథకాలకు సంబంధించిన లబ్ధిని జూన్/జూలైలో, జూలై నుంచి డిసెంబరు వరకు అమలైన పథకాలకు సంబంధించిన లబ్ధిని డిసెంబరు/జనవరి నెలల్లో వారి ఖాతాల్లో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం లబ్ధిదారులకు డీఆర్వో కిషోర్,డీఆర్డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ నమూనా చెక్కు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు

తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది.

తిరుపతి గంగమ్మ గుడిలో గోల్‌మాల్

వేళ్లన్నీ పాలకమండలి వైపే

- జమాఖర్చులకు వీరి ఆమోదం తప్పనిసరి
- అప్పుడు మౌనంగా ఉండడం వల్లే ఇప్పుడు భారీ మూల్యం
- దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ది కూడా ఇదే దారి
- బాధ్యత ఉండక్కర్లేదా అంటూ భక్తుల మండిపాటు

తిరుపతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై వేళ్లన్నీ ఆలయ ధర్మకర్తలమండలి వైపే చూపిస్తున్నాయి. అమ్మవారికి భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలకు జవాబుదారీతనంగా వ్యవహరించాల్సిన పాలకమండలి చైర్మన్, సభ్యులు ఉత్సవ విగ్రహాల్లా మారారన్న చర్చ జరుగుతోంది.అధికారిక లెక్కల్లోనే రూ.52 లక్షలు మాయమైనప్పటికీ పాలకమండలి మౌనంగా ఉండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. దేవదాయ శాఖ చట్టం ప్రకారం ధర్మకర్తల మండలికి కీలకమైన అధికారాలుంటాయి. సభ్యుల సమన్వయంతో చైర్మన్ ప్రధాన భూమిక పోషిస్తుంటారు. ప్రతి నెలా జరిగే పాలకమండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలనే కార్యనిర్వహణాధికారి అమలుచేయాల్సి ఉంటుంది. నెలలో దేనికోసం ఎంతెంత ఖర్చుపెట్టారో జమాఖర్చుల వివరాలను తెలియపరిచి సభ్యుల ఆమోదం తీసుకోవాలి. అవసరానికి మించి ఖర్చు పెట్టివుంటే సమీక్షించి చర్యలు తీసుకునే అధికారం కూడా పాలకమండలికి ఉంది. అయితే గంగమ్మ ఆలయ పాలకమండలి మాత్రం ఇవేమీ పట్టనట్టుగా అమ్మవారిని దర్శనం చేసుకోవడం, తెలిసినవారికి దర్శనం చేయించి పసుపు,కుంకుమలను అందజేయడం వరకే పరిమితమైందన్న ఆరోపణలున్నాయి. ఆలయ సిబ్బందికి జీతాలు సక్రమంగా వస్తున్నాయా? లేదా? కూడా వీరికి తెలియదు. అదేవిధంగా ఆలయంలో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగికి మాత్రమే భారీగా జీతం పెంచిన విషయం ధర్మకర్తల మండలికి తెలియకపోవడం పలు విమర్శలకు దారితీసింది. అంతెందుకు తుడా కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న ఆలయ ఆర్చి గురించి కూడా వీరి దగ్గర ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. ఈ పరిణామాలపై ఇప్పటికే పాలకమండలిలో పలువురు అసంతృప్తిగా ఉన్నారు. తమ హయాంలో గంగమ్మ ఆలయంలో గోల్‌మాల్ జరిగిందన్న అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తోందని మధనపడుతున్నారు. చేసిందెవరో, చేయించిందెవరో....అన్నీ గంగమ్మకు తెలుసంటూ వైరాగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.

● వీరిపైన చర్యలేవీ?

గంగమ్మ ఆలయంలో గత మార్చి ఆర్థిక సంవత్సరానికి జరిపిన ఆడిట్‌లో రూ.17 లక్షలు తేడా కనిపించింది. జాతరకు నెల ముందే ఇంత తేడా వచ్చినప్పుడు దేవదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్, సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్, ఆర్జేసీ ఏమీ మాట్లాడకుండా మౌనం దాల్చడం పలు అనుమానాలకు తావిస్తోంది. వీరిలో పలువురిని 'సంతృప్తి' పరచడంతో పాటు అధికార పార్టీ పెద్దల తరపున వత్తిడి తీసుకురావడం, జాతర తర్వాత లెక్కలు చూసుకుంటామని చెప్పడం వలనే చూసీ చూడనట్టుగా ఉన్నారన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పూర్తిగా విఫలమయ్యారని చెబుతున్నారు. మరి వీరిపై చర్యలు లేకుండా 'అంతా చేసింది' అతనే అంటూ చనిపోయిన ఇన్‌చార్జి ఈవో మునికృష్ణయ్యపై నెట్టేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.ఇంట్లో పెద్దదిక్కు పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఈవో కుటుంబంపైనే భారం మొత్తం వేస్తామనడం భావ్యం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఆర్జేసీ (ప్రాంతీయ సంయుక్త కమిషనర్) సత్యనారాయణ మూర్తి మీడియానుద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 'గంగమ్మ గుడిలో గోల్‌మాల్ పై ఈవో బతికివున్నప్పుడు ఎందుకు వార్తలు రాయలేదని, అప్పుడు అవినీతి కనిపించలేదా అంటూ మీడియాను ఆయన ప్రశ్నించారు.జరిగిన తప్పులను పర్యవేక్షించేందుకు పటిష్ఠమైన యంత్రాంగం ఉండి కూడా బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, ఆలస్యంగానైనా బయటపెట్టిన మీడియాపై అక్కసు వెళ్లగక్కడం ఏమిటనడంతో తాను కొత్తగా వచ్చానని, ఇక్కడ ఏం జరుగుతుందో పూర్తిగా తెలియదని చెప్పుకొచ్చారు.

ఎంఎస్ బాబు యూటర్న్

- మూడు రోజుల్లో మారిన మాట
- పెద్దిరెడ్డి వార్నింగ్ ప్రభావమేనా?

చిత్తూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తనకు టికెట్ నిరాకరించారనే బాధాగ్రహంతో ఘాటు వ్యాఖ్యలు చేసిన పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మూడు రోజులకే మడం తిప్పి, మాట మార్చేశారు. 'అబ్బే.. నేను తప్పుగా మాట్లాడలేదు. అంతా ఎల్లో మీడియా వక్రీకరించేసింది' అంటూ నిందారోపణలకు దిగిన తీరు రాజకీయవర్గాల్లో మళ్లీ చర్చగా మారింది. వైసీపీలో దళితులకు అన్యాయం జరుగుతోందని, దళితుడిగా పుట్టడమే తప్పా అనీ. సీఎంగారూ దళితులను మోసం చేయద్దు అనీ ఆయన అన్న మాటల వీడియోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి. మూడే రోజుల్లో యూటర్న్ తీసుకున్న ఆయన సీఎంనూ, మంత్రి పెద్దిరెడ్డినీ పొగుడుతూ శుక్రవారం విడుదల చేసిన సెల్ఫీ వీడియో తాజాగా వైరల్ అవుతోంది. పాత వీడియోతో కొత్త వీడియోని పోల్చుకుని జనం ఆశ్చర్యపోతున్నారు.

ఈనెల 2న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తన ఆవేదనంతా ప్రకటించారు. ఆ తర్వాత 4న ఎంఎస్ బాబుపై మంత్రి పెద్దిరెడ్డి ఫైర్ అయ్యారు. 'జడ్పీటీసీగా ఓడిపోయిన వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించామనేది గుర్తు చేసుకోవాలి. ఇంగిత జ్ఞానం లేకుండా ఎవరో చెప్పిన మాటలు విని రెచ్చిపోయి మాట్లడటం సబబు కాదు' అని హెచ్చరించారు.

మూడురోజుల్లో మాట ఎలా మారింది...

దీంతో తన మాటలు దిద్దుకుంటూ 5న మళ్లీ ఎంఎస్ బాబు సెల్ఫీ వీడియో విడుదల చేశారు. 'ఈ ఐదేళ్లు మంత్రులు చెప్పిందే చేశాను, మరి వ్యతిరేకత వస్తే అందుకు బాధ్యులు ఎవరు?' అని ప్రశ్నించిన ఆయనే తాజాగా 'పెద్దిరెడ్డి మా దేవుడు. ఆయన మాటకు ఎదిరించి వెళ్లం. ఆయనతోనే ఉంటాం' అన్నారు. ఈ దిద్దుబాటు మాటల వెనుక ఏం జరిగిందనే చర్చ జరుగుతోంది. ఎంఎస్ బాబు పార్టీ మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన తర్వాత సీఎంవో నుంచి పెద్దిరెడ్డికి సూచనలు వచ్చినట్లు తెలిసింది. ఆ మేరకు పెద్దిరెడ్డి ఎంఎస్ బాబుకు గట్టి వార్నింగ్ ఇచ్చినట్లు వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అందుకే ఎంఎస్ బాబు హడావిడిగా కారులో ప్రయాణిస్తూ 5.48 నిమిషాల వీడియో రికార్డు చేసి విడుదల చేశారంటున్నారు. ఆ వీడియోను ఆరుసార్లు పాజ్ నొక్కి రికార్డు చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

టీటీడీ ట్రస్టులకు రూ.40 లక్షల విరాళం

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు శుక్రవారం రూ.40 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన కేవీ రాజశేఖర్‌కు చెందిన జేకేసీ ప్రాజెక్ట్స్ తరపున ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు అందాయి. అన్నప్రసాదం ట్రస్టుకు కొల్లి గోపాలకృష్ణ, మాధవ రూ.20 లక్షలు అందజేయగా ఢిల్లీకి చెందిన శివంగ్ కౌర్ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు.దాతల ప్రతినిధులు మణిరెడ్డి, తిరుపతికి చెందిన రాఘవేంద్ర విరాళపు డీడీలను తిరుమలలో టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

షర్మిల వల్ల మాకు ఎలాంటి డామేజ్ లేదు

మంత్రి మేరుగ నాగార్జున

తిరుమల, జనవరి5(ఆంధ్రజ్యోతి):వైఎస్ షర్మిల రాకతో మాకు డామేజ్ అవుతుందని వాళ్లు, మీరు అనుకుంటున్నారు కానీ మేము అనుకోవడం లేదు.జగన్మోహన్‌రెడ్డిని ఎవరూ ఏం చేయలేదు. దేవుడితో పాటు ప్రజల ఆశీస్సులు మాకున్నాయి..... అని మంత్రి మేరుగ నాగార్జున అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఎవరు ఏ పార్టీలో చేరినా తమకేం కాదన్నారు. ఎమ్మెల్యేల స్థానాల మార్పుపై పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదన్నారు. పరిస్థితులను బట్టి పార్టీ నిర్ణయాలుంటాయన్నారు. ప్రతిపక్షాలకు తమ పార్టీ వ్యవహారాలతో పనేంటి అని ప్రశ్నించారు.గతంలో చంద్రబాబును తిట్టిన పవన్ కల్యాణ్ మళ్లీ కలిశారంటే ఏదో లబ్ధి చేకూరిందని ఆరోపించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 5 : జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి శుక్రవారం తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన వారు 19 నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

10నుంచి అధ్యయనోత్సవాలు

తిరుపతి (కల్చరల్), జనవరి 5: గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏటా ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయంలో దివ్యప్రబంధ పారాయణం జరుగుతుంది. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామి, సేనాధిపతి, ఆళ్వారులను వేంచేపు చేస్తారు. అక్కడ పారాయణం జరుగుతుంది. జనవరి 20న చిన్నశాత్తుమొర, 30న పెద్దశాత్తుమొర నిర్వహిస్తారని టీటీడీ వెల్లడించింది.

గంజాయి విక్రేతల అరెస్టు

నగదు, 5కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 5: రేణిగుంట ఫ్లైఓవర్ సమీపంలో గంజాయి విక్రయిస్తూ ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు...రేణిగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి, పోస్టల్‌కాలనీ క్రాస్ వద్ద అనుమానంగా తచ్చాడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా 5కిలోల గంజాయి, రూ.లక్ష నగదు కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా పాడేరులో కొనుగోలు చేస్తామని, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి నగరం చుట్టుపక్కల ప్రాంతాలలో విక్రయిస్తున్నామని అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వరిలో జింక్ లోపాన్ని నివారించండి



జింక్‌లోప లక్షణాలతో ఉన్న వరిపైరు

తిరుపతి(విద్య), జనవరి 5: రబీలో వరి పైరుకు జింక్ తక్కువయితే దిగుబడిపై ప్రభావం చూపుతుందని, పైరు పచ్చగా ఎదిగి బాగా దుబ్బు చేసేందుకు జింక్ చాలా అవసరమని వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఈశాన్య రుతుపవన వర్షాలు ఆలస్యం కావడం వల్ల చాలామంది రైతులు దుక్కిలో జింక్ ఎరువును సిఫారసుల మేరకు వేయలేకపోయారని, దాంతో వరిలో ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. సున్నం, చౌడు, భాస్వరం ఎక్కువ ఉన్న భూముల్లో మొక్కలకు జింక్ సరిగా అందదని, మురుగునీరు బయటకుపోని పల్లపు ప్రాంతాలలో కూడా జింక్‌లోపం ఎక్కువగా కనిపిస్తుందని వివరించారు. దీని వల్ల పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు.

● లోప లక్షణాలు ఇలా : వరినాటిన 2-6వారాల మధ్య లోప లక్షణాలు కనిపిస్తాయని, మొక్కల్లో పెరుగుదల మందగించి గిడసబారుతాయని పేర్కొన్నారు. పిలకలు రావడం తగ్గుతుందని, మొక్కల మధ్య ఆకులలో ఈనెల మధ్యభాగం పసుపురంగుకు మారుతుందన్నారు. ముదురు ఆకు చివర్లలో తుప్పు మచ్చలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆకులు పెలుసుగా ఉండి వంచితే శబ్ధం చేస్తూ సులభంగా విరిగిపోతాయని తెలిపారు. పొలంలో అక్కడక్కడా మొక్కలు సరిగా పెరగకుండా ఖాళీలు కనిపిస్తాయన్నారు.

● నివారణ చర్యలు : మురుగునీరు బయటకుపోని పొలాల్లో నాటిన రెండు వారాల తర్వాత పాతనీరు పూర్తిగా తీసేసి కొత్తనీరు అందించాలని తెలిపారు. చౌడు భూముల్లో మొదటి దఫా పైపాటుగా వేసే యూరియాకి బదులుగా అమ్మోనియం సల్ఫేట్ వేస్తే చౌడుగుణం తగ్గి జింక్ పెరుగుతుందని వివరించారు. వరిపైరులో ఈ లోప లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికి 2గ్రాముల జింక్‌సల్ఫేట్, 5గ్రాముల యూరియాను వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలని సూచించారు. చిలేటెడ్‌రూపంలో మార్కెట్‌లో దొరికే చిలామినిన్ జింకును లీటరు నీటికి గ్రాము చొప్పున కలపి అవసరాన్ని బట్టి ఒకటి రెండుసార్లు స్ప్రే చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఇతర వివరాల కోసం 8331057872ను సంప్రదించాలని కోరారు.

ఎస్వీయూ ప్రొఫెసర్ మృతి



ప్రొఫెసర్ జాకబ్‌దాస్ (ఫైల్ ఫోటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 5: ఎస్వీయూ జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జాకబ్‌దాస్ (61) శుక్రవారం మృతి చెందారు. షుగర్ తీవ్రతతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కొన్ని రోజులు చికిత్స పొందారు. ఈ క్రమంలో అనారోగ్యం రావడంతో చెన్నై అపోలోకు తరలించే క్రమంలో మార్గమధ్యంలో కన్ను మూశారు. తిరుపతిలోని అమరావతి నగర్‌లో నివాసముంటున్నారు. నంద్యాలకు చెందిన జాకబ్‌దాస్ ఎస్వీయూలోనే పీహెచ్‌డీ పూర్తి చేసి 1992లో ఎస్వీయూ అనుబంధ కావలి పీజీ కేంద్రంలో అధ్యాపకుడిగా చేరారు. ఆయన పర్యవేక్షణలో 29 పీహెచ్‌డీలు, 11 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. 2002లో మలేషియాను సందర్శించారు. 4 యూజీసీ రీసెర్చ్ ప్రాజెక్టులను పూర్తి చేశారు. 80 పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 3 పుస్తకాలు రాశారు. యూనివర్సిటీ హాస్టల్ వార్డెన్‌గా, జువాలజీ విభాగాధిపతిగా వ్యవహరించారు. ఇలా 30 ఏళ్లకు పైగా బోధన, పరిశోధనా రంగాల్లో కృషి చేశారు. జాకబ్‌దాస్ మృతి పట్ల ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. శనివారం నంద్యాలలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

రేపటి నుంచి ఆండాళ్ నీరాటోత్సవం

గోవిందరాజస్వామి ఆలయంలో ఆదివారం నుంచి 13వ తేదీ వరకు ఆండాళ్ నీరాటోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం గోవిందరాజస్వామిని ఊరేగింపుగా శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు తీసుకువెళతారు. అమ్మవారి నీరాటోత్సవాల ఏర్పాట్లను స్వామి వారు స్వయంగా పర్యవేక్షించడానికి ఇలా పుష్కరిణికి వేంచేపు చేస్తారు. ఆండాళ్ అమ్మవారు స్వామి కోసం తపస్సు చేసిందని, అందుకు గురుతుగా ఇలా నీరాటోత్సవం జరుగుతుందని పండితులు చెబుతారు.

నైపుణ్యాభివృద్ధి అధికారిగా లోకనాథం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 5: జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా ఆర్.లోకనాథం నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. శుక్ర వారం కలెక్టర్ వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో స్కిల్‌హబ్స్, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు, నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాలు నిర్వహించడంపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు.

అల్లాహ్ దయతో అందరూ సంతోషంగా ఉండాలి



నాగూర్ ఖాదర్ వలీ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 5: అల్లాహ్ దయతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు నగరి నియోజకవర్గ టీడీపీఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆకాంక్షించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ఆనంబట్టురోడ్డులో ఉన్న నాగూర్ ఖాదర్ వలీ దర్గాలో గంధపు మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భానుప్రకాష్ మతపెద్దల ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే గంధపు మహోత్సవం మతసామరస్యానికి ప్రతీక నిలుస్తోందని కొనియాడారు. ముస్లింలు, హిందువులు కలిసిమెలిసి ఉత్సవాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉత్సవం సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. భానుప్రకాష్‌ను దుశ్శాలువ, పూలదండతో నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి, మహ్మద్ నబీ, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాజాపీర్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రఫీ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సర్దార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ ధనపాల్, కౌన్సిలర్ చంద్రాచ్చారి, మైనార్టీ సెల్ నాయకులు మహ్మద్ రఫీ, కరీమా, హమీద్ బాషా, శంషు, మనస్, జాబీర్ బాషా, తురబ్‌బాషా, మహబూబ్ ఖాన్, నజీర్, రసూల్ పాల్గొన్నారు.

అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

నారాయణవనం, జనవరి 5: అంగన్వాడీల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని టీడీపీ మండలాధ్యక్షుడు గిరిబాబు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు శీతల పానీయాలు, తినుబండారాలు అందజేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ చిన్న పిల్లల ఆలనా, పాలన చూసి వారి అభివృద్ధికి దోహదం చేసే అంగన్వాడీలు 23 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలో రాగానే అంగన్వాడీలను అన్ని విధాలుగా అదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షణ్ముగం, బాబు, రవి, బాల సుబ్రహ్మణ్యం, శరవణ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

యువకుల మధ్య ఘర్షణ

ఒకరికి గాయాలు

పుత్తూరు అర్బన్, జనవరి 5: యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన పుత్తూరులో జరిగింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు... మున్సిపల్ చైర్మన్ అనంగి హరి కుమారుడు తులసికి పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ కుప్పయ్య కుమారుడు విద్యాసాగర్‌కు గురువారం రాత్రి స్థానిక ఆర్డీఎం గేటు వద్ద ఘర్షణ జరిగింది. విద్యాసాగర్ తలకు గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి ఆస్పత్రిలో చికిత్స చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తులసితో పాటు అతని అనుచరులు సునీల్, హేమంత్, కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా దాడికి పాల్పడిన తులసిపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడంతో తాత్సారం చేస్తున్నారని బాధితుడి తరపు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుక్రవారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కేసు నమోదు చేశామని పోలీసులు స్పష్టత ఇవ్వడంతో ధర్నా విరమించారు.

వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

నారాయణవనం, జనవరి 5: వైసీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యమని టీడీపీ మండలాధ్యక్షుడు గిరిబాబు అన్నారు. శుక్రవారం ఆయన నారాయణవనంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఎన్నికల సమయంలో జగన్ ఇష్టానుసారంగా హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక అందరినీ మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు.



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

జగన్ హామీలు... మా చెవిలో పూలు



మున్సిపల్ కార్యాలయం వద్ద చెవిలో పూలతో కార్మికుల నిరసన

పుత్తూరు అర్బన్, జనవరి 5: జగన్ ఇచ్చిన హామీలు కార్మికుల చెవిలో పూలుగా మారాయని ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు డి.మహేష్ ఎద్దేవా చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద డిమాండ్లు పరిష్కరించాలని కార్మికులు చేస్తున్న సమ్మె మూడవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తానని, వేతనాలను పెంచుతానని సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు సమాన పనికి సమాన వేతనం కింద అమలు చేయాలన్నారు. అలాగే కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించి అసువులుబాసిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారంగా రూ.50 లక్షలు చెల్లిస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీ గాలి మాటలేనా అని నిలదీశారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న కార్మికుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే పథకాలకు అర్హులుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం వెలువరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రాట్యుటీ చట్టం అమలు కావడం లేదని దుయ్యబట్టారు. పదవీవిరమణ పొందిన ప్రతి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుడికి రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓట్ల కోసం హామీలిచ్చిన ముఖ్యమంత్రి... అమలు చేయాలని నాలుగున్నరేళ్లుగా విన్నవిస్తున్నా పట్టించుకోకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న జగన్ సర్కార్‌కు గట్టిగా బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని స్పష్టం చేశారు. అనంతరం చెవిలో పూలు పెట్టుకుని సీఎం జగన్ తమ డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల సమ్మెకు మద్దతుగా జనసేన నాయకుడు గోపీ రాయల్ దీక్షలో పాల్గొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రబాబు, నాయకులు గోపి, కార్మికులు గణేష్‌కుమార్, సుమన్, నాగ, సుభాషిణి, శరవణ, విజయ్‌కుమార్, యాకోబు, అంకయ్య, గోవిందస్వామి పాల్గొన్నారు.

జగన్‌ను నమ్మితే నట్టేట మునిగినట్టే



అంగన్వాడీలకు మద్దతుగా దీక్షలో పాల్గొన్న ఆశా వర్కర్లు

పుత్తూరు అర్బన్, జనవరి 5: జగన్‌ను నమ్మి రాష్ట్రంలో కార్మిక వర్గాలు నట్టేట మునిగాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ధ్వజమెత్తారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు రిలే నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు గత 26 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం నియంతృత్వ పోకడలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా వర్కర్లకు నోటీసులు ఇచ్చి ప్రభుత్వ అధికారులతో బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల కోర్కెల పట్ల సానుకూల నిర్ణయం తీసుకునే వరకు సమ్మె విరమించే ప్రసక్తేలేదని ఆయన తేల్చి చెప్పారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా ఆశా వర్కర్లు యూనియన్ నాయకులు హేమావతి, చాముండేశ్వరి దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3 వేలు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్లకు రూ.6 వేలు, ఆశా కార్మికులకు రూ.10 వేలు, అంగన్వాడీ కార్యకర్తలకు రూ.11,500 మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని జీతాలు అంటారా అని నిలదీశారు. పెరిగిన ధరలతో ఈ చిన్న మొత్తం వేతనంతో తాము ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. త్వరలోనే అన్ని సంఘాలు సమ్మెకు సిద్ధమవుతున్నాయని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేతనాల పెంపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు మహేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు మునికుమారి, విజయకుమారి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనలక్ష్మి, రేఖ, మారెమ్మ, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు

ఏర్పేడు, జనవరి 5: కొందరు దళితులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అలాంటి చర్యలు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ సంక్షేమ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి ఏకాంబరం హితవు పలికారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చశారు. వారం రోజుల క్రితం ఏర్పేడు మండలానికి చెందిన ఆరుగురు టీడీపీ నాయకులపై ఓ వ్యక్తి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని గుర్తుచేశారు. కేసు నమోదైన తేదీలలో ఆరుగురు నాయకులు స్థానికంగా లేరని తెలియజేశారు. అందుకు సంబంధించి ఆధారాలు సైతం ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అపహాస్యం చేస్తే కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్లేనని దళితులంతా గుర్తించాలని విన్నవించారు.

పేదలకు ఆర్టీసీ కార్మికుల అన్నదానం


అన్నదానం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

శ్రీకాళహస్తి జనవరి 5: ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బాబు మృతి కార్మికులకు తీరని లోటని ఆ సంఘం గౌరవాధ్యక్షులు, ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. శ్రీకాళహస్తిలోని ఆర్టీసీ కూడలి వద్ద శుక్రవారం బాబు వర్థంతి పురస్కరించుకుని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజువర్ధన్, శ్రీనివాసకుమార్ ప్రభాకర్ పాల్గొన్నారు.

టీడీపీ పాలఏకరి సాధికారిక కన్వీనర్‌గా వెంకటకృష్ణయ్య



కేవీబీపురం, జనవరి5: మండలంలోని ఎస్ఎల్ పురానికి చెందిన వెంకట కృష్ణయ్య తిరుపతి పార్లమెంట్ పాలేకరి సాధికారిక కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా ఈయన గతంలో సురుటుపల్లి పల్లెకొండేశ్వరస్వామి వారి ఆలయ బోర్డు సభ్యుడిగా, జిల్లా పాల ఏకరి సంఘ ఉపాధ్యక్షుడుగా పనిచేశారు.

దారి వసతి కల్పించాలి


విలేకరులతో మాట్లాడుతున్న దాసరి కాలనీ వాసులు

సత్యవేడు, జనవరి 5: ఆక్రమణలను తొలగించి తమ కాలనీకి దారి వసతి కల్పించాలని మండలంలోని దాసుకుప్పం పంచాయతీ చెన్నేరి దాసరికాలనీ వాసులు కోరారు. కాలనీవాసులు హేమంత్ కుమార్, వెంకటరత్నం శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. చెన్నేరి వేణుగోపాల స్వామి ఆలయం పక్కన నాలుగు చక్రాల వాహనాలు వెళ్లడానికి దారి లేదన్నారు. సర్వే నెం.154/1లో ఒక ఎకరా 25 సెంట్లు చుక్కల భూమి ఉందన్నారు. అడంగళ్‌లో సైతం ఈ భూమిని బండి బాటగా ఉందని వివరించారు. ఈ భూమిని కొందరు ఆక్రమించుకోవడం వల్ల దారి ఏర్పాటుకు అడ్డంకిగా మారిందన్నారు. నిబంధనల మేరకు సమస్య పరిష్కరించాలని హైకోర్టు గతంలో ఆదేశించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం రుచిగా పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 5: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచిగా పెట్టాలని ఎంపీడీవో సాయి లహరి తెలిపారు. మండలంలోని వెస్ట్‌వరత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో, ఎంఈవో రవీంద్రనాథ్ శుక్రవారం తనిఖీ చేశారు. భోజనాలు సక్రమంగా పెట్టకపోతే వంట నిర్వాహకులను తొలగిస్తామని స్పష్టం చేశారు.

సర్పంచుల సంఘం అధ్యక్షుడికి సన్మానం

ఏర్పేడు, జనవరి 5: మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్యను ఏర్పేడు శ్రీవెంకటేశ్వరఆటో యూనియన్ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఏర్పేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారు ఆయన్ను కలిసి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సన్మానించారు. యూనియన్ లీడర్ కరీముల్లా, నాగయ్య, సుబ్బయ్య, వైసీపీ నాయకులు నల్లపాళెం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పెంచిన పింఛను పంపిణీ

వరదయ్యపాళెం, జనవరి 5: వరదయ్యపాళెంఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శుక్రవారం పెంచిన నూతన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. అనంతరం వక్ఫ్‌బోర్డు సభ్యుడు అబ్దుల్లా అందించిన ఆడుదాం ఆంధ్రా టీషర్టులను ఆవిష్కరించారు. జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం రాజు, తహసీల్దారు గౌరీశంకర్‌రావు, ఎస్ఐ నాగార్జున రెడ్డి, ఏఎస్ఐ షణ్ముగం, సాయిబాబా పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ

శ్రీకాళహస్తి జనవరి 5: తొట్టంబేడు మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీవో సురేష్ బాబు మహిళలకు 60 యూనిట్ల పెరటి కోళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గురుమూర్తి, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు రేవతి, దుర్గ పాల్గొన్నారు.

కార్మికుడికి ప్రమాద బీమా అందజేత



శ్రీకాళహస్తి జనవరి 5: రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవన నిర్మాణ కార్మికుడికి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. తొట్టంబేడు మండలం శేషమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన గంగాధర్ నిర్మాణ కార్మికుడు. కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఉపాధి కోల్పోయాడు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక హిందుస్థాన్ స్టీల్ అండ్ సిమెంట్ ప్రొప్రైటర్ షేక్ ఇలియాస్ బాబు ఎమ్మెస్ లైఫ్ స్టీల్ సంస్థ ద్వారా రూ.30వేల నగదు చెక్కును గంగాధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ లైఫ్ స్టీల్ ప్రతినిధులు శ్రీధర్, మణికుమార్, శశిభూషణ్, రామన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని కాపాడుకుందాం

శ్రీకాళహస్తి జనవరి 5: చేనేత రంగాన్ని కాపాడు కుందామని ఆప్కో మాజీ డైరెక్టర్ మిద్దెల హరి పిలుపు నిచ్చారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో చేనేత కార్మికుల సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంగా పోరాటాలు చేస్తేనే చేనేత కార్మికులకు మరింత సంక్షేమం అందుతుందని చెప్పారు. అనంతరం కార్మికుల సమస్యల పరిష్కార కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల వాసు, ప్రధాన కార్యదర్శి షణ్ముగ, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వెంకట ముని పాల్గొన్నారు.

'సిపాయి భరోసా' అందజేత



ఏర్పేడు, జనవరి 5: ఏర్పేడు మండలం పల్లం పంచాయతీ పల్లంపేట గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో గతనెల 27న మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం సిపాయ భరోసా కింద శుక్రవారం 25 రకల నిత్యావసర సరుకులను సుబ్రహ్మణ్యం భార్య మీనాకు అందజేశారు. వైసీపీ మండలాధ్యక్షుడు రమణయాదవ్, సింగిల్ విండో ఛైర్మన్ జనార్థన్‌యాదవ్ పాల్గొన్నారు.

నామమాత్రంగా పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 5: పింఛన్ల పంపిణీ బీఎన్ కండ్రిగలో నామమాత్రంగా జరిగింది. మండలంలో ఆరు మాసాల వ్యవధిలో 147 మంది వితంతువులు, వికలాంగులు, వృద్ధులు పింఛనుకు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 62 మందికి మాత్రమే మంజూరయ్యాయి. అందులోను శుక్రవారం కేవలం 22 మందికి మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన 40 మందికి డబ్బులు వచ్చాక పంపిణీ చేస్తామని ప్రస్తుతానికి మంజూరు పత్రం అందించారు. దీంతో వారంతా నిరాశగా వెనుదిరిగారు. మిగిలిన 85 మంది అర్హత ఉన్నా పింఛన్ రాలేదని వాపోయారు. ఎంపీపీ సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, ఎంపీడీవో సాయి లహరి, తహసీల్దార్ భార్గవి, వైసీపీ మండల కన్వీనర్ విద్యానాథరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడు మురుగేష్

పిచ్చాటూరు, జనవరి 5: పిచ్చాటూరు మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండల గౌరవ అధ్యక్షులుగా వెంకటేశ్వరులు, అధ్యక్షులుగా మురుగేష్, ప్రధాన కార్యదర్శిగా గురుప్రసాద్ యాదవ్, మండల మహిళా అధ్యక్షురాలుగా అమ్ములు, జిల్లా కౌన్సిలర్‌గా షణ్ముగం, మహిళా కౌన్సిలర్‌గా వలర్ మది, ఆర్థిక కార్యదర్శిగా మీన తదితర సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి సదాశివం వ్యవహరించారు. తిరుపతి జిల్లా పీఆర్‌టీయూ జనరల్ సెక్రటరీ సి.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

తక్షణం దర్యాప్తు చేపట్టండి


రెడ్డి దేవదానం

వరదయ్యపాళెం, జనవరి 5: ఇందిరా నగర్ పంచాయతీలో జరిగిన అవకతవకలపై తక్షణం దర్యాప్తు చేపట్టాలని సామాజిక కార్యకర్త రెడ్డిదేవదానం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అక్రమాలకు సంబంధించి సర్పంచ్, కార్యదర్శులపై ఎందుకు చర్యలు తీసుకోలేని ప్రశ్నించారు. అధికార పార్టీ దన్నుతో నిధులు దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఇకనైనా అక్రమార్కులపై చర్యలు తీసుకుని పంచాయతీని అభివృద్ధి బాటలో నడపాలని కోరారు.

అయోధ్య అక్షింతల స్వీకరణ

శ్రీకాళహస్తి జనవరి 5: అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను స్వీకరించడం ఎంతో మహద్భాగ్యమని బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు శుక్రవారం శ్రీకాళహస్తిలో పర్యటిస్తున్న బొజ్జల దంపతులను కలిసి అయోధ్య అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన ఊరందూరులో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ భక్తులు గరికిపాటి రమేష్ బాబు,టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, తిరుపతి పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల జగనన్న సురక్ష

ఏర్పేడు, జనవరి 5: ఏర్పేడు మండలం పల్లం సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుమారు వందమంది వరకు పేదలు వైద్యం చేయించుకున్నారు. ఉచితంగా వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రమణయ్యయాదవ, గోపాల్‌యాదవ్, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మండల కేంద్రంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, వైసీపీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, సర్పంచ్ జ్యోతి, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని ముడియూరు సచివాలయ పరిధిలో రెండో దశ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, నాయకులు బాబురెడ్డి, చెంగల్రాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల నోటీసులు దగ్ధం


సత్యవేడులో నోటీసులు దగ్ధం, బీఎన్‌కండ్రిగలో రోడ్డుపై ఎమ్మెల్యే ఆదిమూలానికి వినతిపత్రం

సత్యవేడు, జనవరి 5: సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని కోరుతూ ఐసీడీఎస్ అధికారులు ఇచ్చిన నోటీసులను దగ్ధం చేసి అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. సమ్మె శిబిరం వద్దకు సీడీపీవో దేవకుమారి శుక్రవారం విచ్చేశారు. అంగన్వాడీలకు నోటీసులు అందించారు. అయితే నోటీసులు అందుకున్న అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించేవరకు విధులకు హాజరు కాబోమని తేల్చిచెప్పారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, అంగన్వాడీ కార్యకర్తల నాయకులు నిర్మల, శాంతి, ఇందిర, ఝాన్సీ, భారతి, కాంత మ్మ, సుభాషిణి, దివ్య, గౌరి, మంజుల, అనూష, అనిల భువన, రజని, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేయడానికి వచ్చిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని స్థానిక రహదారిపై అంగన్వాడీలు అడ్డగించారు. సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులో అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె ఆగదని స్పష్టం చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు, నాలుగు మండలాల అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

భూకబ్జాదారులకు జైలు శిక్ష తప్పదు


ఆక్రమణలను పరిశీలిస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి జనవరి 5: శ్రీకాళహస్తిలో భూకబ్జాలకు పాల్పడుతున్న అక్రమార్కులకు జైలు శిక్ష తప్పదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. శ్రీకాళ హస్తి లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల స్థలాన్ని వారం రోజుల క్రితం కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఈ భూకబ్జాపై సుధీర్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి శుక్రవారం కళాశాల స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణలపై స్థానికులను ఆరా తీశారు. అధికార పార్టీ నాయ కులు రాత్రి వేళలో చదును చేసినట్లు వెల్లడించారు. ఓ నిరుపేద వ్యక్తి వేసుకున్న రేకులను సైతం ధ్వంసం చేసినట్లు స్థానికులు వాపోయారు. ప్రిన్సిపల్ సుధాకర్ స్థల వివరాలను సుధీర్ రెడ్డికి వివరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అనుచరులైన షోరా, సలీంతో పాటు మరి కొందరు కలిసి కళాశాల స్థలాన్ని చదును చేశారని ఆరోపించారు. ఇక్కడే తాజాగా కమ్మ సంఘం భవనానికి ఆనుకుని ఉన్న కళాశాల స్థలాన్ని గురువారం రాత్రి మళ్లీ చదువు చేసినట్లు చెప్పారు. ఇక చెంచులక్ష్మి కాలనీలోని అర్హులం దరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ పట్టణ అధ్యకులు విజయ్ కుమార్, పార్లమెంట్ కోశాధికారి రమేష్ పాల్గొన్నారు.

పేదల బతుకులతో రాజకీయాలు తగదు

పేదల బతుకులతో రాజకీయాలు తగదని చెంచులక్ష్మి ఎస్టీ కాలనీవాసులు, వైసీపీ నాయకులు గోరా అన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నేతల వ్యాఖ్యలను ఖండించారు. ఇళ్ల స్థలాలు కావాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి విజ్ఞప్తి చేయడంతో తమ కాలనీకి ఆనుకుని ఉన్న స్థలాన్ని ఇచ్చి కలెక్టరు ద్వారా పట్టాలు ఇచ్చే ప్రయత్నం చేశారన్నారు. అయితే టీడీపీ నాయకులు దీన్ని రాజకీయం చేస్తూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల స్థలాన్ని ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేస్తున్నారని దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు.

● బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన సతీమణి రిషితారెడ్డి 12వ వార్డు పరిధిలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, కంఠా రమేష్ పాల్గొన్నారు. ● వెల్లంపాడు ఎస్టీ కాలనీలో మృతిచెందిన పుల్లయ్యకు బొజ్జల బృందమ్మ నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు ఉన్నారు.

సీఎంపై తహసీల్దారు ప్రశంసలు..!


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు గౌరీశంకర్

వరదయ్యపాళెం, జనవరి 5: సీఎం జగన్‌పై వరదయ్యపాళెం తహసీల్దారు గౌరీ శంకర్ ప్రశంసలు కురిపించారు. వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాల యంలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు గౌరీశంకర్ మాట్లాడుతూ సీఎం పేదల పక్షపాతి అని రాష్ట్రంలో ప్రవేశపెట్టన పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. జగన్ ప్రవేశపెట్టిన పథకాలు అమలు అవుతాయో లేదో అని కొందరు విమర్శలు చేశారని ఇపుడు వాటిని పక్కరాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఉద్యోగులకు జీతాలు ఆగినా పేదలకు మాత్రం పింఛన్లు ఆపడం లేదన్నారు. సీఎం ఇచ్చిన హామీ రూ.3వేలు అని నాలుగు విడతలుగా రూ.2వేలు నుంచి రూ.3వేలుకు చేర్చడం గర్వకారణమన్నారు. కాగా బాధ్యత గల తహసీల్దారు ఇలా ఓ పార్టీ కార్యకర్తలా మాట్లాడడం తగదని జనం చర్చించుకుంటున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


హీరోయిన్ నందిని రాయ్, కేజీఎఫ్ విలన్ రామ్

శ్రీకాళహస్తి జనవరి 5: శ్రీకాళహస్తీశ్వ రాలయాన్ని శుక్రవారం సినీ హీరోయిన్ నందిని రాయ్, నటులు గరుడా రామ్, చిత్తూరు జిల్లా జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, జనవరి 5: టీడీఈపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన వెంకటగిరిలో 'రా... కదలిరా...' పేరిట నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో వెంకటగిరి, డక్కిలి మండలాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి జన సమీకరణపై చర్చించారు. అనంతరం తిరుపతి - వెంకటగిరి రోడ్డు మార్గంలో సభ నిర్వహించే ప్రాంతాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి కురుగొండ్ల పరిశీలించారు. జనసేన నాయకులు తోటా కృష్ణయ్య, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, ఛీరం రాజేశ్వరావు, చెంచయ్య, రమేష్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, జన్ని రమణయ్య, అవ్వారు సత్యనారాయణ, ఏలేశ్వరం రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

గూడూరు, జనవరి 5: వెంకటగిరిలో ఈనెల 9వ తేదీన జరగనున్న చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగసభను జయప్రదం చేద్దామని గూడూరు నియోజకవర్గ పరిశీలకుడు పెళ్లకూరు శ్రీనివాసులరెడ్డి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీన వెంకటగిరిలో జరగనున్న బహిరంగసభకు నియోజవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు సైకో ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకవిధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకుని రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, రవీంద్రరెడ్డి, గుండాల లీలావతి, ఇశ్రాయేల్‌కుమార్, శివకుమార్, నరసింహులు, అమరేంద్ర, శ్రీదేవి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రప్ప

గూడూరు, జనవరి 5: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తనవిగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే విధంగా నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలన్నారు. పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, పనబాక కోటేశ్వరరావు, మోహన్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, బిందురెడ్డి, మనోజ్‌కుమార్, శ్రీనివాసరావు, సాయిలక్ష్మణ్, చెంచురెడ్డి, గాలి ప్రకాష్‌నాయుడు, సంజీవనాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, నరేంద్రపాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి



రామాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 5: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ రామాపురంలో శుక్రవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ అరాచకాలతో రాష్ట్రం దివాళా తీసిందని, ప్రతి ఒక్కరూ మేలుకొని సైకో జగన్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వేణు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా కొలితోటకు



గోవింద మాలతో పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

వెంకటగిరిటౌన్, జనవరి 5: వెలుగొండ అడవుల్లోని కొలితోటలో వెలసిన లక్ష్మీనరసింహ సమేత చెంచమ్మకు మొక్కులు చెల్లించేందుకు 370 మంది భక్తులు గోవింద మాలతో పాదయాత్రగా శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా నరసింహ స్వామి, చెంచమ్మను గరుడ వాహనంపై ఊరేగించారు. అనంతరం ఈవో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఏటా కాశీ విశ్వనాథ స్వామి ఆలయం నుంచి భక్తులు ఇరుముడి కట్టుకుని కొలితోటకు పాదయాత్ర వెళ్లి చెంచమ్మకు మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, జనవరి 5: మండల పరిధిలోని దావాదిగుంట గ్రామానికి చెందిన శ్రీహరికోట వేమమ్మ(88) గురువారం రాత్రి మృతి చెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు చెన్నైలోని శంకర నేత్రాలయ ఆస్పత్రికి దానం చేశారు. కార్యక్రమంలో ఆచార్య భరద్వాజా సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా వార్డులో ఒక్క పనీ జరగలేదు

వైసీపీ కౌన్సిలర్ ఆగ్రహం



పనులు జరగలేంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ షబ్బీర్

నాయుడుపేట టౌన్, జనవరి 5: నా వార్డులో ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పనీ జరగలేదంటూ 14వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఛైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొదటగా కమిషనర్ శ్రీనివాసరావు వార్డుల వారీగా జరిగిన అభివృద్ధి పనులను వెల్లడించారు. దీనిపై 14వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తన వార్డులో ఎలాంటి అభివృద్ధి పనీ జరగలేదని, పనులు చేపట్టేందుకు ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకురావడం లేదన్నారు. ఎటువంటి అభివృద్ధి పనులు చేయనందు వల్ల వార్డులోకి వెళ్లలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ స్పందిస్తూ తక్షణమే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు.

ఎన్నికల విధులపై శిక్షణ

గూడూరు, జనవరి 5: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీహాలులో శుక్రవారం గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలోని ఎన్నికల సెక్టారు అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. రిటర్నింగ్ అధికారి కోదండరామ్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సెక్టారు అధికారులు అప్రమతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, చంద్రముని తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి - మొదటి మూడు బహుమతులు అందుకున్న యమున, ఝాన్సీరాణి, సుశ్మిత

ముగ్గులు మహిళల్లో కళకు ప్రతిరూపం

ఆకట్టుకున్న ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి రంగవల్లుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు సులక్ష్మి, మహిత, గ్రీష్మపురోహిత్

గూడూరు, జనవరి 5: ముగ్గులు మహిళల్లోని కళకు ప్రతిరూపమని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సారధ్యంలో నెల్లూరులోని చందన బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ నిర్వహించిన రంగవల్లుల పోటీలు కనువిందు చేశాయి. 45మంది మహిళలు రెండు గంటల పాటు శ్రమించి రంగురంగులతో ముగ్గులను తీర్చిదిద్దారు. గూడూరు పట్టణంలోని వీరారెడ్డిపల్లికి చెందిన ఏ.ఝాన్సీరాణి ప్రథమ బహుమతి, మండలంలోని నెల్లటూరుకు చెందిన ఎన్.సుశ్మిత ద్వితీయ బహుమతి, పట్టణంలోని నరశింగరావుపేటకు చెందిన ఆర్.యమున తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వీరితో పాటు మరో ముగ్గురు మహిళలకు కన్సోలేషన్ బహుమతులుగా చీరలు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు. న్యాయనిర్ణేతలుగా సునీతసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, సభ్యులు మహిత, గ్రీష్మపురోహిత్ వ్యవహరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి గడిచిన 15 సంవత్సరాలుగా ఏటా సంక్రాంతి పండుగకు ముందు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీలు మహిళల్లో పనిఒత్తిడి తగ్గించి ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపుతాయన్నారు. న్యాయనిర్ణేత సారంగం సులక్ష్మి మాట్లాడుతూ పాతరోజుల్లో ఇంటి ముంగిట బియ్యం పిండితో ముగ్గులు వేయడం అలవాటుగా ఉండేదన్నారు. ఆ పిండి చీమలకు, పక్షులకు ఆహారంగా ఉండేదని గుర్తుచేశారు. అపార్టుమెంట్ల సంస్కృతి పెరగడంతో ముగ్గులకు ఆదరణ తగ్గిందని, ఇలాంటి సమయాల్లో మహిళలను రంగవల్లుల వైపు మళ్లించేందుకు ఆంధ్రజ్యోతి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





వెంకటగిరి వీధుల్లో సాగుతున్న బస్సుయాత్ర - రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు

వెలవెలబోయిన వైసీపీ బస్సు యాత్ర

భోజనానంతరం జారుకున్న జనం

వెంకటగిరి టౌన్/డక్కిలి, డిసెంబరు, 5: వైసీపీ సామాజిక సాధికార సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం వెంకటగిరి నుంచీ రాపూరు వరకూ చేపట్టిన బస్సు యాత్ర పాక్షికంగానే సఫలమైంది. యాత్రలో భాగంగా జరిగిన రోడ్‌షోకు మధ్యాహ్నం వరకూ జనం మోస్తరుగా కనిపించినా భోజనాల తర్వాత జారుకున్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఎక్కడా జరగని రీతిలో భారీ ఎత్తున బస్సుయాత్రను విజయవంతం చేయాలని కసరత్తు చేశారు. వారం రోజులపాటు నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు జరిపారు. గురువారం రాత్రికి జనం వచ్చే పరిస్థితి లేదని గ్రహించి ఒక్కో వలంటీరు యాభై మందిని చొప్పున బస్సు యాత్రకు తీసుకురావాలని ఆదేశించారు. బస్సుయాత్రలో సినీ నటుడు అలీ పాల్గొనడంతో అతన్ని చూసేందుకు మధ్యాహ్నం వరకూ జనం బస్సు యాత్ర వెంట బాగానే కనిపించారు. మధ్యాహ్నం భోజనాలు పెట్టాక మాత్రం ఎవరి దారిన వారు జారుకున్నారు. దీంతో తర్వాత జరిగిన బస్సు యాత్రలో జనం పలచగా కనిపించారు. కాగా వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ను బస్సు యాత్రకు ఆహ్వానించలేదని ప్రచారమైంది. ఆమె యాత్రలో కనిపించకపోవడంతో బీసీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అన్న విమర్శలు వినిపించాయి. అలాగే బస్సు యాత్ర సందర్భంగా పోలీసుల అత్యుత్సాహంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాత్రలో రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను నియోజకవర్గ ఇంచార్జిగా నియమితుడినయ్యాక స్వల్ప వ్యవధిలోనే ఎక్కువ అభివృద్ధి చేశానన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. మార్గమధ్యంలోని డక్కిలి మండల కేంద్రంలో కమ్మపల్లి రోడ్డు సెంటరు వద్ద ముఖ్య అతిధిగా పాల్గొన్న సినీ నటుడు అలీ మాట్లాడుతూ హలో... నా పేరు అలీ అంటూ ప్రజలకు పరిచయం చేసుకున్నారు. ప్రజలు సామాన్యులు కాదని, నాయకులను ఎంతో ఆదరిస్తారని, అభివృద్ధి చేయకపోతే తోకలు కత్తిరిస్తారన్నారు.ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌రావు, నెల్లూరు మేయర్ స్రవంతి తదితరులు మాట్లాడగా తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు సునీత, సిపాయి సుబ్రమణ్యం, జిల్లా గ్రంధాలయ అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ శారద, దేవాంగ కార్పొరేషన్ ఛైర్మన్ సురేంద్ర, స్థానిక నేతలు చింతల శ్రీనివాసులు రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కాల్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, చెలికం శంకరరెడ్డి, దశరథరామిరెడ్డి, నర్రావుల ప్రకాశం నాయుడు, కోళ్లపూడి వేణుగోపాల్, కార్తీకరెడ్డి, నక్కా వెంకటేశ్వర్లు, మాడా జానకిరాం, ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.కాగా డక్కిలిలో బస్సుయాత్రకు వచ్చిన జనానికి మద్యం సరఫరా చేశారు. బస్సుయాత్ర డక్కిలిలోకి ప్రవేశించక ముందే జనం మద్యం బాటిళ్లు పట్టుకుని కనిపించారు.

రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు

వైసీపీ బస్సు యాత్రను అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. బస్సు దగ్గరకు పోనివ్వకుండా పోలీసులు అడ్డుపడడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో తిరుపతి ఎంపీ గురుమూర్తి బస్సు దిగి వారి నుంచీ వినతిపత్రం స్వీకరించారు. అంగన్వాడీల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, పైగా సమస్య వినాలని శాంతియుతంగా కోరిన మహిళలను పోలీసుల ద్వారా నెట్టించడం దారుణమంటూ సీఐటీయూ నేత చెంగయ్య మండిపడ్డారు.

సిలికా, ఇసుక లారీల అడ్డగింత



వాహనాలను అడ్డుకుని నిరసన తెలుపుతున్న కలవకొండ గ్రామస్తులు

చిల్లకూరు, జనవరి 5: మండలంలోని కలవకొండ గ్రామస్తులు శుక్రవారం సిలికా, ఇసుక లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిలికా, ఇసుక లోడుతో వెళుతున్న లారీలు, టిప్పర్లు తమ గ్రామంలో వేగంగా వెళుతున్నాయన్నారు. దీని వల్ల రోడ్డు మీద దుమ్ము ఇళ్లలోకి చేరుతోందన్నారు. అంతేకాకుండా లారీలు, టిప్పర్ల వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిలికా, ఇసుక వాహనాల వేగాన్ని నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి



ఛైర్ పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కందల కృష్ణారెడ్డి

నాయుడుపేట టౌన్, జనవరి 5: పట్టణంలో ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ ఛైర్ పర్సన్ కటకం దీపికకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో విలువైన స్థలం అన్యాక్రాంతమైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సర్వే చేసి స్థలాలను పరిరక్షించాలని కోరారు.

సంచారజాతులకు న్యాయం చేయండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నక్కలోళ్లు

నాయుడుపేట టౌన్, జనవరి 5: తమకు న్యాయం చేయాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సంచారజాతులు(నక్కలోళ్లు) నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల క్రితం పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న తమను ఉన్న ఫలంగా ఖాళీ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరువ్యాపారాలు చేసుకుంటున్న తమకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డున పడేశారని వాపోయారు. సంచారజాతుల(నక్కలోళ్ల)కు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, సీఐటీయూ నాయకులు చాపల వెంకటేశ్వర్లు, శివకవి ముకుంద మద్దతు పలికారు.

సమావేశానికి హాజరుకండి

పెళ్లకూరు, జనవరి 5: నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య కోరారు. ఈ నెల 9న వెంకటగిరిలో నిర్వహించే రా.. కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాల్గొంటారని, ఈ సభను విజయవంతం చేయడంపై చర్చించనున్నట్లు చెప్పారు.





చెంగాళమ్మ ఆలయానికి ర్యాలీగా వెళ్తున్న అంగన్వాడీలు - గూడూరులో గొబ్బిళ్లు ఆడుతూ నిరసన

చెంగాళమ్మా... సీఎం మనసు మార్చు తల్లీ

అమ్మవారికి అంగన్వాడీల మొక్కులు

సూళ్లూరుపేట, జనవరి 5: తమ సమస్యల పరిష్కారం కోసం 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, సీఎం మనసు మార్చి తమ డిమాండ్లు పరిష్కారయ్యేలా దీవించమ్మా- అంటూ అంగన్వాడీలు శుక్రవారం చెంగాళమ్మ తల్లిచెంత వినతిపత్రం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీగా చెంగాళమ్మ ఆలయం వద్దకు వెళ్లి సీఎం మనసు మార్చాలంటూ పూజలు చేసి అమ్మవారిని వేడుకొన్నారు. వీరికి సీఐటీయూ నేతలు లక్ష్మయ్య, మనోహర్, పద్మనాభం సంఘీభావం తెలిపారు.

గూడూరు: పట్టణంలోని గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 25వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు గొబ్బిళ్లు ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ప్రభావతి, ప్రసన్న, మునికుమారి, లక్ష్మి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ, శివకుమార్, ప్రసాద్, సురేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట: న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం మూడు వారాలుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని వర్కర్లు, హెల్పర్లు ధ్వజమెత్తారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట శుక్రవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు.

నాయుడుపేట టౌన్: తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శుక్రవారం గేయాలు పాడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, సీఐటీయూ నాయకుడు ముకుంద, అంగన్వాడీ సంఘ నాయకురాలు సంధ్య, మేరి, ప్రమీల, నాగమ్మ, చెంగమ్మ, సుదర్శన, కళావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

గూడూరు, జనవరి 5: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 11వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరంలో పారిశుధ్య కార్మికులు పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ తమకు ఇచ్చిన హమీలను నెరవేర్చేవరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో గోపినాథ్, శివకుమార్, బీవీ.రమణయ్య, రమేష్, కోటేశ్వరరావు, ప్రభావతి, పెంచలమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, మణెమ్మ, పెంచలప్రసాద్, మురళి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం వద్ద తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలంటూ కార్మికులు నిరసన తెలిపారు. కార్మికుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదని యూనియన్ నాయకుడు రామయ్య విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జీతాలు పెంచి సమస్యలను పరిష్కరించేందుకు చొరవతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మనోహర్, అల్లెయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం సమ్మె నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు శుక్రవారం చెడు వినకు... చెడు చూడకు... చెడు మాట్లాడకు అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు 11 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం సబబుకాదన్నారు. ఇకనైనా పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వెంకటగిరి: మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 11వ రోజు కొనసాగింది. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న చెత్త ట్రాక్టర్లను ప్రైవేట్ కార్మికులతో బయటకు తీసేందుకు అధికారులు ప్రయత్నం చేయడంతో సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకొన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ప్రైవేట్ కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టడం తగదంటూ నినాదాలు చేశారు. వడ్డిపల్లి చెంగయ్య, కల్లూరి జాన్ తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేటలో చెవులు మూసుకుని పారిశుధ్య కార్మికుల నిరసన